UNIVERSAL
LIBRARY
OU_204810
UNIVERSAL
LIBRARY

Osmania University Library

Call No. Accession No.

Author

Title

This book should be returned on or before the date last marked below.



శ్రీ పైండా వెంకటరత్నం
కృతిభర్త



శ్రీమతి పైండా రామామణి
కృతిభర్త సతీమణి

# మున్నుడి

'కావ్యేషు నాటకం రమ్యమ్' అన్నారు.

తెనుగులో ఉత్తమ కావ్యాలనేకం ఉన్నాయి. కాని, ఉత్తమ నాటకాలు మాత్రం బహుకొద్ది.

పాత్రపోషణ, సంఘర్షణ, సంభాషణా చాతుర్యము, కథాకథనము, సన్నివేశ కల్పనము కలిగి సమాజానికి అద్దంపట్టే నాటకాలు మరీ తక్కువ.

అటువంటి నాటకాలు వ్రాయడానికి రచయితకు ఏకాగ్రత, సంస్కారం, భావనాబలం, చిన్న చిన్న అనుభవాలు, విమర్శనాత్మకదృష్టి, లక్ష్యశుద్ధి, వ్యుత్పత్తి మొదలైనవి ఉండాలి.

ఇన్ని లక్షణాలు ఒక షేక్స్‌పియర్‌లో, ఒక కాళిదాసులో ఒక ఇబ్సెన్‌లో తప్ప సామాన్యుల్లో ఉండవు.

లేవని, నిరాశపడి, రచన సాగించక పోతే సాహిత్య వ్యవసాయమే కుంటు వడుతుంది. సమాజ చైతన్యమే ఆగిపోతుంది. రచయిత లోని వేదనా మానసమే దెబ్బ తింటుంది. అందుకే సమర్థతకు అభ్యాసం తోడుకావాలి. అప్పుడే సాహితీ వృక్షం క్రొత్త చివురులు తొడుగు

తుంది. ఈ నాటకం వ్రాసి అయిదారు సంవత్సరాలు గడిచాయి.

రాజ మహేంద్రవరంలో ప్రభుత్వ కళాశాలలో నేను పనిచేస్తున్నపుడు, మిత్రులు జమదగ్ని, కనక్ ప్రవాసి, చెళ్ళపిళ్ళ సీతారామమూర్తి వంటి సహృదయుల ప్రోత్సాహ ప్రోద్బలాలతో నేను దీన్ని వ్రాయడం, చిరంజీవులైన విద్యార్థులచేత విశాఖపట్టణంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ రంగస్థలిపై ప్రదర్శింపజేయడం జరిగింది.

నాటకానికి పఠన పాఠనాలే కాదు, ప్రయోగార్హత కూడా కావాలి. రంగస్థలిపై, పద్మవ్యూహ సాంఘిక నాటకాన్ని చూచినపుడు నాకు నిరాశ కలుగలేదు. కొంత సంతృప్తికూడా కల్గింది. శ్రీ కె. వి. గోపాలస్వామి డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి ప్రభృతులు మెచ్చుకొన్నపుడు ధైర్యంవచ్చింది. శతావధానులు యన్. సి. హెచ్. వేంకటాచార్యులు గారు ఆశీర్వదించినపుడు హృదయం ఆర్ద్రమైంది. ఒక ఊరికీ, ఒక రంగస్థలికీకాక యావదాంధ్ర జనతకూ దీన్ని పరిచయం చేయాలన్న ఊహ పొడమింది. ముద్రించమని మిత్రులు శ్రీ సనకా రాజారావు ప్రోత్సహించినపుడు ఎట్లా అన్న ప్రశ్న ఉదయించింది.

పుస్తకం ముద్రింపబడటమే కాదు అందంగా, మనసుకు నిండుగా, కంటికి ఇంపుగా కనుపించాలి.

చేతిలో బలమూ, మనసులో జపమూ, గుండెలో జీవమూ, కాసిని ఊహలూ, కాస్త భాషా వున్న ప్రతివాడూ కృతి కర్త కాగలడు. కాని జేబులో డబ్బులున్న ప్రతివాడూ కృతిభర్త కాలేడు. అందుకు రసప్లావితమైన హృదయమూ, ఎముకలేని చెయ్యీ కావాలి. పైండావారి షష్టిపూర్తి ఇందులకొక అవకాశాన్ని నాకిచ్చింది. అందుకొని, దీన్ని ఉపాయనంగా ఆ వదాన్యుడికి సమర్పించాను.

ఆయన ఇప్పుడు సహృదయులైన సర్వాంధ్ర పఠితృలోకానికి దీన్ని ఆర్ద్రహృదితో అర్పిస్తున్నారు.

అందుకొని ఆశీర్వదించండి.

ప్రదర్శించి ఆనందించండి.

విమర్శించి మేలు చేయండి.

ఇప్పటికే ఈ రచనపై అభిప్రాయాలు వెలిబుచ్చినవారికీ ఇకముందు తెల్పనున్న వారికీ, నా కృతజ్ఞతలు హార్దికంగా తెల్పనీయండి. అందంగా ముద్రించి అనుకున్న దానికన్న ముందుగా అందించిన స్వతంత్ర ఆర్టు ప్రింటర్సువారికీ, ముఖచిత్రాన్ని గీచియిచ్చి పుస్తకానికి సౌందర్యాన్ని నుమడింప జేసిన ప్రఖ్యాత చిత్రకారులు శ్రీ శంకర్‌కూ నా అభివందన లందజేయనీయండి.

ఇట్లు,
కొండముది శ్రీరామచంద్రమూర్తి

# పాత్రలు

శివయ్య

నారాయణ

రఘుపతి

సుబ్బారాయుడు

భుజంగరావు

కనకయ్య

మహేంద్రం

కోటప్ప

గురవయ్యశెట్టి

సబిన్‌స్పెక్టర్

జానకి

# పద్మవ్యూహం

## ప్రథమాంకం

ఇంకా పూర్తిగా తెర తొలగకుండగనే మంద్రస్థాయిలో ప్రారంభించి శివయ్య ఆరోహణ స్వరంలో శివకవచాన్ని పారాయణం చేస్తూండటం విన్పిస్తుంది.

శివం శివకరం శాంతం శివాత్మానం శివోత్తమమ్
శివమార్గ ప్రనేతారం ప్రణతోస్మి సదాశివమ్.
మహాదేవం మహేశానం, మహేశ్వర ముమాపతిమ్
మహాసేన గురుం వందే మహాభయ నివారిణమ్.

ఇప్పుడు పూర్తిగా తెర తొలగిపోయింది. కన్పిస్తోన్న దృశ్యం - పూజా పునస్కారాలేక, జీర్ణమై, గతకాలపు మహాత్వానికి సాక్షీభూతమై, గంభీరమై, గగుర్పాటును కలిగిస్తోన్న మహాదేవుని ఆలయం. ఆ ఆయతనానికి ప్రాకారాదులు లేవు. పగిలిపోయిన పానవట్టం .... చెన్ను దరిగివున్న నందీశ్వరుడు, పడిపోతున్న ధ్వజస్తంభం .... ఒక్క నీలకంఠుడు మాత్రం, ఏమాత్రం వసివాడనటుల కన్పిస్తున్నాడు. ఎవరో ఎన్నడో నుదుట నద్దిన గంధాక్షతలు .... ఆ దేవునిమీద, గర్భగుడి ఇవతల, చుట్టుపట్ల, పరిసరాలను పొదువుకుంటూ అస్తమిస్తున్న సూర్యుడూ,

ఉదయించని చంద్రుడూ వీరిద్దరి కిరణాలూనూ. ఆ మహాదేవుని ముందు శివయ్య పద్మాసనంలో వున్నాడు. నిమీలితనేత్రుడై, పరమేశ్వరుని తనలో దర్శించుకొంటున్నాడు. ఆరుపదుల జీవితం గడిపినట్లు కన్పించని జ్ఞానవృద్ధు. పచ్చని దబ్బపండువంటి శరీరం, పండిపోయిన మీసాలు, పట్టుబట్ట కట్టుకుని వున్నాడు. యజ్ఞోపవీతధారి.

గౌరీవల్లభ! కామారే! కాలకూట విషాశన!
మాముద్ధరాపదం బోధే స్త్రిపుర ఘ్నాన్త కాన్తక.
మృత్యుంజయాయ రుద్రాయ నీలకంఠాయ శంభవే.
అమృతేశాయ శర్వాయ మహాదేవయతే నమః

చివరి చరణం పాడుతూ కుడివైపునుంచి మహేంద్రం, ఎడమవైపునుండి కోటప్ప ప్రవేశం. ఇద్దరికీ త[illegible]గాలున్నాయి. ఇద్దరి చేతుల్లోనూ పొడుగుపాటి త్రిశూలం. కోటప్ప లావుగా, పొట్టిగా వున్నాడు. మహేంద్రం సన్నగా అతనికన్న పొడుగ్గా వున్నాడు. చూడటానికి భీకరుడూ, దేహదార్ఢ్యం కలవాడు కోటప్ప. మహేంద్రం కన్నులు అతి నిశితాలు. పట్టుదలనూ, తెగింపునూ సూచిస్తుంటాయి ఇద్దరూవచ్చి చెరోవైపునా క్రీనీడల్లో నిల్చుండి పోయారు వారికి అక్కడి దృశ్యమంతా కన్పిస్తోంది. ఎదుటివారు మాత్రం అక్కడిదాకా వచ్చి వారిని పరకాయించి చూస్తేకాని, వారు కన్పించరు.

*శివయ్య :*

కృపాసముద్రం సుముఖం త్రినేత్రం
జటాధరం పార్వతీ వామభాగం

సదాశివం రుద్ర మనన్త రూపం
చిదమ్బరేశం హృది భావయామి
భూతనాథ! సదానంద! సర్వభూత దయాపర!
రక్ష రక్ష మహాబాహో! శాస్త్రేతుభ్యం నమోనమః.

మహేంద్రం :
(చివరి చరణం వినిపిస్తుండగా మెల్లిగా, దృఢంగా) ఎవర్రా అది? కోటప్పా?

కోటప్ప :
(పెద్దగా) అవును, నేనే........ (ప్రశ్నిస్తున్నట్లు)........ మహేంద్ర ?....

మహేంద్రం :
వూఁ!.... వచ్చావా? ....బాగుంది, కూచో అక్కడ.

కోటప్ప :
(కూచుంటూ) నువ్వా సమయానికి వచ్చావు !? (కోటప్ప కళ్ళు గుళ్ళోకి తొంగిచూస్తూ) రంగిని వదిలిపెట్టి రాలేవేమో అనుకున్నాను. (కొంచెం నిశ్శబ్దం)
ఇయ్యాల దేవుడు బతికొచ్చినట్టున్నాడు....

మహేంద్రం :
(భయంకరంగా) దేముడు కాదు, దయ్యం. ఈ లోకంలో

బతికేవి బతికించేవీ, ఏడ్చేవీ ఏడ్పించేవీ. మనుషులూ దేవుళ్లూ కాదురా, - దయ్యాలు.

కోటప్ప :

పోరా. నీ ఏదాంతమూ. నువ్వూనూ.

శివయ్య :

(మెల్లిగా) భూతనాథ ! సదానంద !
సర్వభూత దయాపర !
రక్ష రక్ష మహా బాహో !
శాస్త్రితుభ్యం ! నమో నమః ! !

కోటప్ప :

ఇయ్యాల దేవుల్లాంటి ఈయ నొచ్చినాడు దేనికో ?

మహేంద్రం :

రోజులు బాగా నేక.

కోటప్ప :

అంటే ?

మహేంద్రం :

హు. హు. హు. అటు సెంద్రుడు మబ్బు సాటు కెళ్ళడం ! ఇటు ఆ కుర్రోడి పేణాలు గాలిలో కలిసి పోవడం, రెండూ వొక్కసారి జరగాల. గ్నాపకం నేదూ ?

**కోటప్ప :**

అయితే....

మహేంద్రం :

కసాయోడి కత్తికి కళ్ళు లేవురా. దేని మెడ అడ్డం వత్తే దాని మెడే తెగిపోతుంది.

కోటప్ప :

(**అర్థమై, భయంతో, మెల్లగా**) ఒరేయ్! ఒరేయ్ ! వద్దురా. అంత అన్యాయం వద్దురా. ఆ బామ్మడు సాలా మంచోడు. అబద్దం సెప్పడు. అన్యాయం సెయ్యడు. దేవుళ్ళాంటోడు.

మహేంద్రం :

హు ! దేవుడు ?.... దేవుడు దొరగారి డబ్బులో వున్నాడ్రా..... దేవుడడ్డం వచ్చినా, దొరగారి పని నెరవేరాల్సిందే.

కోటప్ప :

(పెద్దగా) ఒరేయ్ ! (బ్రతిమాలుకుంటూ) నా మాట ఇన్రా. నీ కాళ్ళట్టుకుంటాను. ఆయన జోలికెళ్లొద్దు మనం. ఆయన మనవేపు కళ్లెత్తి చూత్తేనే చాల్రా' మన పాపిట్టి జల్మలు తరించి పోతాయ్. మనకు సొరగం వొత్తుంది.

మహేంద్రం :

తాగొచ్చినావంట్రా ?

కోటప్ప :

అవును. ఇయ్యాల తెల్లారు జామున ఈరాం ఇంటి కాణ్ణుండి, తూలుకొంటూ పాటలు పాటుకొంటూ, ఎటో పడి పోయ్యాను. నాకు గ్నాపకం నేదు. ఆయన ఇంటిదాకా వెళ్ళి అక్కడ, ఆయన గుమ్మం ముందు తెలివి తప్పి పడిపోయ్యానంట. ఆ దర్మాత్ముడు, ఆ దేవుడు, ఆ మహానుబావుడు నన్ను తాకి, ఇంటోకి తీసుకు వెళ్ళి, ఏదో మందు గొంతులో పోసి, ఇంత తాగడానికి ఇచ్చి, తెలివి తెప్పించి ఇటువంటి పన్లు మానుకోమని బుద్ధిసెప్పి, ఎన్ను నిమిరి ఇంటికి పంపిచాడ్రా

మహేంద్రం :

ప్చ ! ప్చ ! ప్చ !

కోటప్ప :

(బరువుగా) నాకు తెలుసురా, నువ్వు నవ్వుతున్నావ్... అవును .... నిజం సెప్పినా ఎవ్వరూ నమ్మరు.

మహేంద్రం :

(ఇంకా పెద్దగా నవ్వుతూ) నిజెం ? మన బెతుకులకు నిజమేవిట్రా ? తెల్సిందల్లా ఒక్కటే నిజం. కావల్సిం

దల్లా పొట్టకింత టండి. కడుపులో పేగులు కారు మనకుండా వుండడం. పొద్దున్న లేసింది మొదలు ఎట్టా కడుపు నింపుకోడమా అన్న ఆలోచన మనకు. ఎవడు కడుపు నింపితే ఆడు దేవుడు. ఎవడు మనకు పావులా డబ్బులిస్తే ఆడు నాయకుడు. ఎందుకురా పిచ్చి పిచ్చి మాటలు మాట్లాట్టూ పిరికోడివై పోతావ్?

కోటప్ప :

నిజమే! పిరికోణ్ణి! పొద్దున్న అయానింటో ఆ మాటలిన్నప్పట్నుంచి ఆ మనుసుల్ని సూసినప్పట్నుంచి. పిరికోణ్ణి అయి పోనాను.

మహేంద్రం :

(దగ్గరకు వచ్చి) ఒరేయ్! ఒక్క సంగతి సెప్తాను ఇనుకోరా. ఆర్నెళ్ళనాడు నీ ఊరానికి మురి పదియేను రూపాయలిచ్చినావు. మళ్ళీ ఒక్క దమ్మిడీ ఈనేదు. ఇదేరా నీ మగతనం? ఇదేరా నీ జీవితం?

కోటప్ప :

అ .... ఆ సంగతి నీకెట్టా తెలుసు?

మహేంద్రం :

(మ్లానంగా) ఊరాం సెల్లెలు కాదంట్రా రంగి.

కోటప్ప :

నీ సంగతీ నాకు తెలుసు. రంగికి జరీ చీర కొని

పెడతానని మాటుయిచ్చి, సెల్లించలేక మొగం తప్పిత్తున్నావ్.

మహేంద్రం :

అందుకు నాకు సిగ్గు లేదురా.

మన బెతుకులే అంత. అణాకన్నా ఎక్కువా, బేడకన్నా తక్కువా. (లోపల్నుంచి ఘంటాస్వరం. కొద్ది మవునం. మహేంద్రం. కోటప్పకు దగ్గరగా వెళ్ళి, అతని బుజం తట్టుతూ) దయిర్యం సేయరా. ఈ ఒక్కపని సేసినామో, మనమే కాదు, మన మనవలు కూసుని తిన్నా తరగనంత ఆత్తినిత్తా డాదొర. కూంత నమ్మకముంచు.

కోటప్ప :

కానీ .... కానీ .... ఆ బామ్మడు .... శివయ్య.... మహేంద్రం, నీ కాళ్ళట్టుకుంటాను. అయన్నిక్కణ్ణుంచి ఒగ్గిసేరా.

మహేంద్రం :

ఒక షరతు మీద.

కోటప్ప :

ఏవిటది ?

మహేంద్రం:

రగుపతివచ్చేలోపునే మీ దేవు డిక్కణ్ణుంచి తప్పుకోవాల.

కోటప్ప :

ఎల్లకపోతే ?

మహేంద్రం :

సా....ఫా....

కోటప్ప :

సరే, సరే అయితే. అట్టాగే, అట్టాగే సెపుతా. అదిగో ఆయనొత్తున్నాడు ఎల్లిపో. వెళ్ళిపోరా ఇక్కణ్ణుంచి నిన్ను చూత్తే మరీ అనుమాన పడతాడు.

(లోపల గర్భగుడిలో శివయ్య లేచి నుంచుంటాడు).

మహేంద్రం :

నన్నుసూసి అనుమాన పట్టానికి నేనేం కేతువునంట్రా. (కొంచెం ఆగి నవ్వి) సరేలే. అగ్గిపుల్లోటి ఇల్లాఇయ్యి.

కోటప్ప :

ఇదిగో బీడీకూడా తీసుకోపో. పోరా తొందరగా.

(బీడీ. అగ్గిపెట్టె యిచ్చి అతన్ని ప్రక్కకు నెట్టేసాడు. లోపల్నుంచి పళ్ళెంలో అర్చన సామగ్రినీ, ఆరగింపు చేసిన ఫలాలను పెట్టుకొని శివయ్య గర్భగుడిదాటి, ముందు మంటపం లోకి వస్తాడు)

శివయ్య :

(వస్తూ) పరమేశ్వరా ! ఈ తనువులు నీవి. నీ తేజస్సు మాది. స్మరణ మాత్రంచేత మాయాకల్పితమైన

జగత్తు ఇది. ఈ జగత్తులో భాగములేనా ఈ నాస్తి కత్వమూ, ఈర్ష్యా ద్వేషములూ, రక్తదాహమూ, పశువాంఛా....

కోటప్ప :

(ఎదురెళ్ళి) దండాలు బాబూ !

శివయ్య :

దైవదర్శన ప్రాప్తిరస్తు. (పరకాయించి చూచి) ఎవరూ ? ఓ.... నువ్వా కోటప్పా ! ! ఏమిటి ఇల్లా వచ్చావ్, ఎన్నడూ లేనిది ? (కోటప్ప భయపడిపోతున్నాడు) ఒంట్లో ఎలావుంది ? సర్దుకుందా ? (కోటప్ప తలా డిస్తాడు) ఇదిగో నాయనా ఈ ప్రసాదం తీసుకో. (కోటప్ప చేతులు పడతాడు. శివయ్య ఇచ్చిన పండును తీసుకుని, ఒక్కసారి నోట్లో వేసుకోబోతాడు) అఁ ! అఁ ! అట్లాకాదు నాయనా ! ప్రసాదశేషాన్ని ఒక్కసారి కళ్ళకద్దుకుని నోట్లో వేసుకోవాలి. (కోటప్ప అట్లాగే చేస్తాడు) బావుంది.

కోటప్ప :

(ఏదో చెప్పాలనుకుని, చెప్పలేక) బాబూ....

శివయ్య :

(ఒకచోట కూచుంటూ) పరమేశ్వరా ! ఇంకా ఎన్నాళ్లు నాయనా ఈ బ్రతుకు .... నీ ఆజ్ఞ లేనిదే చీమైనా

కుట్టుకుండావుంది.... కోటప్పా, అలా నిలబడ్డా వేం-
కూచో.

కోటప్ప :

కాదు బాబూ ....

శివయ్య :

కూచో కోటప్పా ! ! పరమేశ్వరుని సన్నిధిలో కూడా
సందేహా లెందుకు ?

కోటప్ప :

కాదుబాబూ ! .... మీ .... రు ....

శివయ్య :

ఆఁ ! నేను ?

కోటప్ప :

ఇక్కణ్ణుంచి ....

శివయ్య :

ఆఁ ! ఇక్కణ్ణుంచి ?

కోటప్ప

(గద్గదికంగా) వెళ్ళిపోవాలి బాబూ.

శివయ్య :

వెళ్ళిపోవాలా ?! .... ఎక్కడికి ? (తేలిగ్గా) ఇంటి
కన్నా గుడి పదిలం అన్నసంగతి నీకు తెలీదూ.

కోటప్ప :

నన్ను చమించండి బాబూ. నే చెప్పేదినండి. మీా రిక్కణ్ణుంచి ఎళ్ళిపొండి. నా మాటినండి. తొందరగా ఎళ్ళిపొండిబాబూ ! మళ్ళీ ఆడొత్తాడు.

శివయ్య :

వాడా ? అతనెవరు కోటప్పా ? మహేంద్రం కాదు గదా ?.

కోటప్ప :

ఆడే, ఆడే బాబూ ! ఆ డసలే తొందరపాటు మనిసి. సెప్పేదానికీ, సేసేదానికీ భేదం వుండదు, ఒట్టి పౌరుషం మనిసి.

శివయ్య :

కోటప్పా ! నిన్నరాత్రి నీకేం చెప్పాను. ఇకనైనా మారటానికి ప్రయత్నించమన్నాను. అవునా ? త్రాగుడు, వ్యభిచారం, పేకాట, ఈ వ్యసనాలు నిన్నే కాక నీ కుటుంబాన్నికూడా నాశనంచేస్తాయని చెప్పాను కాదూ ? మళ్ళీ మోసంతోనే జీవించదల్చు కున్నావా ? ఆ మహేంద్రంతో సావాసం మాన మన్నాను. వీరాం కొంపకు వెళ్ళవద్దన్నాను. అయినా ఈ మాత్రం చెయ్యలేవు నువ్వు.

కోటప్ప :

కాదు బాబూ, బ్రతకడానికి మరో మార్గం లేక....

శివయ్య :

ఏమిటయ్యా బ్రతకడం? ఒకళ్ళను మోసంచేసి, మరొకళ్ళ అడుగులకు మడుగులొత్తి, వేరొకడిని చంపి....

కోటప్ప :

(పెద్దగా) బా....బూ....!

శివయ్య :

అవును కోటప్ప! నీ కండల్లో బలంవుంది. నీ మనసు మంచిదైతే బ్రతకడానికి సరి అయిన మార్గమే దొరకదా? (క్షణకాలం నిశ్శబ్దం. కోటప్ప జవాబు చెప్పడు. శివయ్య పరమేశ్వరుణ్ణి చూస్తూ) పరమేశ్వరా! ఈ కాల మేమిటీ? మనిషిలో మనిషికి నమ్మకం చెరిగిపోయిన తర్వాత ఎందుకు ఈ యుగధర్మం. (లేచినుంచుంటూ) సరే. వెళ్తున్నాను కోటప్పా. (ముందుకు రెండడుగులు వేసి, వెనక్కు తిరిగిచూస్తూ) నువ్వు రావేం?

(కోటప్ప ఏమీ తోచక అతన్ని అనుసరించి, రంగస్థలానికి కుడివైపువరకూ వస్తాడు. ఇంతలో దూరంనుండి 'బాబూ' అన్న గద్గదికమైన పిలుపు. ఆర్తిలోవున్నట్లున్న ఆ స్వరం. క్రమ క్రమేపీ సమీపిస్తుంది. శివయ్యా, కోటప్ప అలాగే ప్రాణపడి పోతారు. దాదాపు శివయ్య వయస్సు అంతేవున్న నారాయణ

తూలుకుంటూ 'బాబూ' అని కలవరిస్తూ, రంగస్థలం ఎడమ వైపువరకూ వచ్చి, ఇహ నడవలేక అక్కడ కూలబడి పోతాడు. మాసి మరీ నలుగై పోయినాడు. కళ్ళలో మాత్రమే ప్రాణాలు. బొమికలు కన్పిస్తున్నాయి. తైలసంస్కారంలేని చిక్కులు పడివున్న పలిత కేశాలు.)

**నారాయణ :**

(మూలుగుతూ) శ్రీమన్నారాయణ! పశ్చాత్తాపం, పాపానికి పరిహారం కాదా? అమ్మా దాహం.... దాహం........ (పడిపోయి పెదిమలు తడుపుస్తూ) ఎంత కాలమో యీ పరీక్ష? అబ్బ....మంట....మంట

**శివయ్య :**

కోటప్పా పట్టుకో, పట్టుకో అతన్ని ఆ! ఆఁ! మెల్లిగా మెల్లిగా కూచోబెట్టు. పాపం నోరెండి పోతున్నట్లుంది.

బాబూ ఎవరో మీరు, కొంచెం ఓపిక చేసుకొని నోరు తెరవండి, ఈ కొబ్బరినీళ్లు కాసిని తాగితే ప్రాణం సేద తీరుతుంది.

(నారాయణ నోరు తెరుస్తాడు. తీర్థంవున్న గ్లాసులోనుంచి ఉద్ధరిణతో మెల్లమెల్లగా ఒక్కొక్క చుక్క శివయ్య అతని గొంతులో పోస్తూంటాడు. కొంతసేపటికి అతను కళ్లు తెరచి నీరసంతో లేవలేక ఎదురుగ్గా దేవుళ్ళాంటి శివయ్యను చూసి మాట్లాడలేక నమస్కరిస్తాడు)

**శివయ్య :**

కృష్ణార్పణమస్తు. ఎల్లావుంది నాయనా ?

**నారాయణ :**

అమృతం త్రాగినట్లుంది. మీ రెవరో కాని....

**శివయ్య :**

నన్ను శివయ్య అంటారు. ఒకానొకప్పుడు ఈ ఆలయానికి పూజారిని. (నారాయణ, కోటప్పవేపు అనుమానంగా చూస్తాడు) అతను కోటప్ప. చాలామంచివాడు.

**కోటప్ప :**

(స్వగతంగా) మంచివాణ్ణా ! ! !

**నారాయణ :**

(గొణుక్కుంటున్నట్లుగా) —

శివయ్య .... శివసాన్నిధ్యం .... బావుంది .... అంతా ఓ కలగా వుంది .... చచ్చి బ్రతికి నట్లుంది.

**శివయ్య :**

ఏవిటి బాబూ, మీలో మీరే మాట లాడకుంటు న్నారు. భగవత్ప్రార్థన చేసుకుంటున్నారా ?

**నారాయణ :**

ప్రార్థన .... హు .... గత ఇరవై యేళ్ళుగా ప్రార్థన చేసి చేసి, భగవంతుణ్ణి స్మరించి, ఇదిగో

ఈ గతికి వచ్చాను. వాడికోసమని ఉన్న వూరు వదిలిపెట్టి ....

కోటప్ప :

ఏ వూరు బాబూ, ఎక్కణ్ణుంచి వత్తున్నారు ?

నారాయణ :

జ్ఞాపకం లేదు బాబూ, నావూరేదో నేనే మర్చిపోయాను.

శివయ్య :

పోనీ ఎక్కడకు వెళ్తున్నారు ?

నారాయణ :

అదీ తెలీదు. వాడెక్కడ కన్పిస్తే అక్కడవరకూ.

కోటప్ప :

ఆ డెవరు ?

శివయ్య :

ఈ జీవునియొక్క రహస్యమే అంత. మాయలో చిక్కుకోగానే ఎక్కణ్ణుంచి వస్తుందో ఆ సంగతి మర్చిపోతుంది. మాయలో నుంచి బయటపడలేక ఎక్కడకు వెళ్ళాలో ఆ సంగతీ మర్చిపోతుంది.

నారాయణ :

మాయ, మాయకాదు. ఇదంతా ప్రత్యక్షం. అబ్బా ! మంట .... మంట ....

శివయ్య :

తీసుకోండి బాబు, ఈ అరటిపండును తీసుకోండి. వాడికోసమని అట్టే పెట్టాను. అయినా వాడికన్నా, మీకే దీనితో ఎక్కువ అవుసరం వుంది.

కోటప్ప :

ఆడెవరు బాబూ ?

శివయ్య :

రఘు.

కోటప్ప :

**(ఉలిక్కిపడి, భయంతో)** ర....ఘు....

నారాయణ :

**(ఒక్కసారిగా)** ర....ఘు....మా నాయన పేరూ అదే. నా బాబు, నా చిట్టితండ్రి వాడి పేరూ అదే. **(విచారంతో)** వెళ్ళిపోయాడు. నన్ను విడిచిపెట్టి, .... దిక్కులేనివాణ్ణిచేసి....

కోటప్ప :

రెక్కలిర్సికట్టి తీసుకు రానేకపోయినారా ?

**నారాయణ :**

వాడే నా రెక్కలు విరిచేశాడు. నా పాపాలను వేలెత్తి చూపించాడు. తన తల్లిని చంపిన హంత

కుణ్ణి, నన్ను, క్షమించలేక, ఎక్కడికో వెళ్ళి పోయాడు.

కోటప్ప :

చంపారా ?

శివయ్య :

ఇంటి ఇల్లాలును ?

నారాయణ :

అవును. చంపాను. తాగుడు మైకంలో, చీట్లాటలో డబ్బు పోయిందన్న చీదరలో, ఇంటికొచ్చిన నన్ను మందలించిందన్న కోపంలో, వేళకు అన్నం వండ లేదన్న ఆవేశంలో, అవును. చంపుకున్నాను. నా లక్ష్మిని నేను చంపుకున్నాను. చేతులారా చంపుకున్నాను. ఆ కోపంలో, ఆ ఆవేశంలో, ఆ పిచ్చిలో - చేతికందిన కత్తిపీటను తీసుకుని - దానిమీదకు విసిరేశాను. (ఏడుస్తూ) లక్ష్మి, నా లక్ష్మి, తిట్టలేదు. ఒక్క తిట్టు నన్ను తిట్టలేదు. 'అమ్మా !' అని అరవనైనా అరవ లేదు. రెండుచేతులూ దగ్గరకు జోడించుకుని 'భగవంతుడా' అని ప్రాణం విడిచింది. (వెర్రిగా **తలనేలకేసికొట్టుకుంటూ**) నేను పాపిష్టిని.... కిరాతకుణ్ణి.... పెళ్ళాన్ని చంపుకున్నాను. కొడుకును వెళ్ళగొట్టుకున్నాను. కాదు,

వాడే వెళ్ళిపోయాడు. ఈ రాక్షసుడిదగ్గర వుండలేక, ఈ హంతకుడి దగ్గర వుండలేక, తన తల్లి లేనిచోట, తన తల్లి రక్తం మడుగులు కట్టినచోట వుండలేక, గంపెడు చీకటిని నెత్తిన వేసుకుని, ఎటో వెళ్ళి పోయాడు.

కోటప్ప :

కొడుకుకోసమే బయల్దేరినారా ?

నారాయణ :

అయ్యా ! శివయ్యగారూ ! మీరు దేవుళ్ళా కన్పిస్తున్నారు. ఒక్కమాట, ఒక్కమాట చెప్పండి. వాడు వాడిహ నాకు కనుపించడూ ?

శివయ్య :

ఎందుకు కనుపించడూ ? తప్పకుండా కన్పిస్తాండు. మీరిద్దరూ కలుసుకుంటారు, తొందర్లోనే, దగ్గర్లోనే.

నారాయణ :

నిజమేనా ? నిజమేనా యిది ? అయ్యో! అయ్యో ! గుండె ఆగిపోతున్నట్లున్నది. ఇంత చల్లనిమాట చెప్పినవారు ఇంతవరకు ఒక్కరులేరు. ఒ....క్క.... రు....భగవంతుడా ! నాది ఎంత పాపిష్టి గుండె అయినా ఈ ఒక్కకోర్కె తీర్చు. నా బిడ్డనూ, నన్నూ కలుసుకోనీ. మనసారా, వాడిచేత 'నాన్నా' అని

నన్ను పిలిపించుకోనీ. 'క్షమించాను' అని వాడు నన్నుఅననీ. ఆ తర్వాత.... ఆ తర్వాత....ఏమయినా నాకు పర్వాలేదు. భగవంతుడా! ఈ ఒక్కకోర్కె తీర్చు.

శివయ్య :

ఆవేశపడకు. అసలే బలహీనంగా ఉన్నావు. అంతా సవ్యంగా జరుగుతుంది. నేను చెప్తున్నాను విను. పశ్చాత్తాపం అగ్నిలాంటిది. నిన్ను తప్పకుండా పవిత్రుణ్ణిచేస్తుంది.

నారాయణ :

పవిత్రుడు.... పవిత్రుడు.... భగవంతుడా!........ భగవంతుడా!!....

శివయ్య

నాయనా! ఇంతకూ నువ్వెవరో చెప్పావు కాదు?

నారాయణ :

నా. రా. య. ణ.!! అబ్బా! బాధ.... మంట.... భరించలేను. ఈ బాధ భరించలేను.

శివయ్య :

కోటప్పా — మెల్లిగా ఇతన్ని నీ రెండుచేతుల మీదుగా తీసికుని, మన యింటికి తీసుకుపద.

కోటప్ప :

అట్టాగే బాబూ.

(కోటప్ప అతన్ని మెల్లిగా లేపి నుంచోబెట్టి, ఆనుకుని రెండడుగులు వేయిస్తాడు).

శివయ్య :

పరమేశ్వరా ! సమస్తం బాధామయమేనా ? అవును బాధలోనుంచి, కన్నీళ్ళలోనుంచి, తపనలోనుంచి, వేదనలోనుంచి కాని జీవుడు పవిత్రుడు కాడు.

(పూజా సామగ్రి తీసుకుని వాళ్ళను అనుసరించబోతాడు. మహేంద్రం ఎడమ ప్రక్కనుంచి జాగిలంలా ప్రవేశించి, కోటప్పకు నారాయణకూ ఎదురుగ్గా నుంచుని)

మహేంద్రం :

(మెల్లగాను కఠినంగానూ) కోటప్పా !

కోటప్ప :

ఓ హో !

మహేంద్రం :

ఓ హో ! శివయ్యగారు కూడ ఈడ్నేవున్నారు ! సాలా ఆశ్చర్యంగా వుంది.

శివయ్య :

నేనిక్కడ వుండడంలో ఆశ్చర్యం ఏమీలేదు మహేంద్రం. కానీ ఈ పవిత్ర వాతావరణంలోకి నీవు రావడమే కొంచెం శుభాన్ని సూచిస్తోంది.

మహేంద్రం :

(వికటంగా నవ్వుతూ) హు. హు. మీ దేవుడుండేది, మాలాంటి వాళ్ళు తిరిగే వల్లకాట్లోనే, తెలీనట్లు మాట్లాడుతున్నారు శివయ్యగోరు. ఏరా కోటప్పా? కదూ ?!

కోటప్ప :

నాకు తెలీదు.

మహేంద్రం :

ఓహ్హో ! పిల్లికి ఎలుక వంత పలుకుతోంది. యాడికిరా బయల్దేరినావ్ ?

శివయ్య :

నారాయణను తీసుకుని మా యింటిదాకా వస్తాడు.

మహేంద్రం :

నారాయనెవరు ?

కోటప్ప :

ఈ ముసలాయనేరా.

మహేంద్రం:

ఓహ్హో !

కోటప్ప :

ఎల్లొత్తాన్రా. (నారాయణను తీసుకుని ముందుకు రెండడుగులు వేస్తాడు).

మహేంద్రం :

(కఠినంగ) ఆగు, (అందరూ ఆగిపోతారు)

కోటప్ప :

(నవ్వుతూ) బెదిరిత్తున్నావా ? .... పదండి శివయ్య గోరూ, ఆడితో మీకెందుకు ?

మహేంద్రం :

ఒరేయ్ ! నక్కజిత్తుల దొంగెదవా (అని) కదిలావా కత్తికి కండేత్తాను.

కోటప్ప :

(కత్తిదీసి) జాగర్త. తెగించిన వాడికి పేణాలమీంద ఇలువ వుండదు.

శివయ్య :

కోటప్పా ! ఏమిటిదంతా ?

కోటప్ప

మీకు తెలీదుబాబూ. కత సాలావుంది.

మహేంద్రం :

(వాగా తగ్గిపోయి) ఒరేయ్ । నీతో ఓమాట మాట్టాడాలి, ఇట్టూరా.

కోటప్ప :

మంచిగా వుండేవోడికి అంతా మంచే అవుతుందిరా. శివయ్య బాబూ, కూంత ఆ నారాయణ బాబును

పట్టుకుని వుండండి. ఒక్కమాట ఈడితో మాట్లాడే స్తాను.

శివయ్య :

(రహస్యంగా) జాగ్రత్త కోటప్పా— అడుగు జారడం చాలా తేలిక.

కోటప్ప :

బయంలేదు. ఒక గుండె, ఒక నాలిక, ఒకపని కోటప్పది. పదరా.

(కోటప్ప, మహేంద్రం ఇద్దరూ రంగస్థలానికి కుడివైపుకు వెళతారు. శివయ్య, నారాయణను పట్టుకుని ఎడమ వేపుకు రెండడుగులువేసి అక్కడ నిలబడతారు.)

మహేంద్రం :

ఏందిరా ఇది ?

కోటప్ప :

ఏమిటి ?

మహేంద్రం :

నమ్మి నీ సేతికి కుడుము నిత్తే, ఇసిరిపుచ్చుకు నేలకొట్టావంట్రా ?

కోటప్ప :

ఇంకా కుడుము న్నేతీసుకోనేదు.

మహేంద్రం :

అబద్ధం సెప్పకు. మాట తీరుత్తానని పెమాణం సేయ్యి నేదూ ?

కోటప్ప :

తప్పుడుపని సెయ్యటానికి పెమాణకా లేవిట్రా !

మహేంద్రం :

తప్పుడుపని ? ఇదివరకు నువు సేసిన పన్లు ? రాగ వయ్యా పేక్టరీలోంచి దొంగతనంగా పది బత్తాలు కాజేసి అమ్ముకోడం. మాటుందని సెప్పి కామాచ్చిని పిల్చుకు వెళ్ళి....

కోటప్ప :

ఆ కోటుప్ప కాదురా ఈడు. ఆడు సచ్చిపోనాడు.

మహేంద్రం :

దొరగారు తల్చుకుంటేనా నిన్ను జైలుకు పంపిత్తారు.

కోటప్ప :

దొరగారు తల్చుకుంటేనా ?.... (నవ్వుతూ) నాతో పాటు దొరగారూ నువ్వూకూడా వత్తారు.

మహేంద్రం :

అయితే రానంటూవ్ ?

కోటప్ప :

మళ్ళీ అదే తప్పుడు మాట....

మహేంద్రం :

సీ కర్మ. ఎళ్ళయితే. (కోటప్ప వెళ్ళబోతాడు) మాట,

కోటప్ప :

ఇంకా ఏంట్రా ?

మహేంద్రం :

ఏం నేదు. ఇక్కడికి మనం వచ్చిన రహస్యం ఎవరికీ సెప్పవుగందా ?

కోటప్ప :

ఆ కోటప్ప సచ్చిపోనాడ్రా. ఆడితోనే ఆడి జ్ఞాపకాలు సచ్చిపోనాయి. (పెద్దగ) పదండి శివయ్‌బాబు ఎళ్ళిపోదాం. (మెల్లగా) శివయ్‌బాబుమీద సెయ్ సేసుకున్నారో సచ్చారే మీరు. జ్ఞాపకముంచుకోండి. పదండి బాబూ.

(రఘుపతి వీరి కెదురుగా పరుగెత్తుకుని వస్తాడు. మనిషి స్ఫురద్రూపి. పాతికా - ముప్పై మధ్యనున్న యవ్వనం. ఆలోచనా, ఆవేశమూ రెండూ వున్న మనిషి, అని చూడగానే అనిపిస్తుంటుంది)

రఘు :

శివయ్ బాబాయ్ ! శివయ్య బాబాయ్! విన్నావా? ఈ సంగతి విన్నావా ?

శివయ్య :

ఏమిటి నాయనా—ఏం జరిగింది ?

రఘు :

ఇంకేముంది ? — సర్వనాశనమైంది. ఏటి కేడాది పశువుల మేతకని వుంచుకున్న గడ్డివాములు తగుల బెట్టేశారు. అంతకన్నా నన్నూ తగలబడితే సరి పోయేది. నోరులేని పశువులు వాటి నెందుకూ మాడ్చడం ?

శివయ్య :

పరమేశ్వరా !.... అంతా నీ కృప .... పద రఘూ ! పద, చూసొద్దాం పద. ఇంకాఏమైనా అక్కడ మిగిలి ఉందేమో (నడిచి) ఆఁ! అన్నట్టు నువుకూడా ఎందుకూ నావెంట, ఇదిగో ! ఈ నారాయణను మనయింటికి తీసుకు వెళ్ళు. జాగ్రత్తసుమా. కోటప్ప ! నువ్వూ, రఘుపతిని కనిపెట్టుకుని వుండు. వస్తాను. జాగ్రత్త! జాగ్రత్త రఘూ ! (వెళ్ళిపోతాడు)

మహేంద్రం :

(ఓ రాతిమీద కూచుని చుట్ట కాల్చుకుంటూ) ఇంకా ఏముం దక్కడ ? ఒ....ట్టి.... బూడిద.

రఘు :

అవును బూడిద. బూడిదే మిగిలింది. ఈ సర్వనాశ నానికి కారకులు....

మహేంద్రం :

ఎవరు ?

రఘు :

మీ దొ....ర (**మహేంద్రం పగలబడి నవ్వుతాడు**).

కోటప్ప :

అదితో మీకెందుకు ? పదండి రగుపతి బాబుగోరూ. నారాయణ బాబును తీసికొని మీరు పదండి. నేనూ వొత్తున్నాను.

రఘు :

నువ్వా నువ్వెందుకు ? నువ్వా ఆ దొరగారి మోచేతి నీరు త్రాగేవాడివే కదూ ?

**నారాయణ :**

ర....ఘు.... (తనలో **తను**)

రఘు :

ఓ ! మీరేనా నారాయణ బాబుగారు ! ! పదండి.

(**ముందుకు నడవబోతాడు. కోటప్ప అనుసరిస్తాడు. అదిచూచి కోపంగా**) వద్దని చెప్పాను. (**నారాయణ,** రఘు **వెళ్ళి పోతారు**)

మహేంద్రం :

(**కోటప్ప మ్రాన్పడి పోవడంచూసి**) గొర్రె ఎప్పుడూ కసాయోన్నే నమ్ముతుంది.

(కోటప్ప మాట్లాడడు. ఓ చుట్ట వెలిగించుకుని ఎడమవేపు మంటపానికి ఆనుకుని కూచుండి పోయాడు.)

మహేంద్రం :

పాపం ! నిన్ను చూస్తే జాలేస్తోంది.

కోటప్ప :

(లేచి చుట్ట అవతల పారేసి. శివలింగం ముందుకు వచ్చి. మోకాళ్ళమీద ఆనుకుని కూచుని నమస్కారం పెడుతూ)

దేవుడూ ! ఇంకా నన్ను నువ్వు నమ్మడం లేదు గదూ ?

మహేంద్రం :

ఒరేయ్ ! అది రాతి బొమ్మరా. సమాధానం సెప్పదు.

కోటప్ప :

కాదు, సెపుతుంది. ఏం దేవుడూ, నిజంగా నన్ను నువ్వు నమ్మడం లేదు గదూ ? (ఓ ప్రక్కనుంచి జానకి ప్రవేశిస్తుంది. పదిహేను ఇరవై మధ్యనున్న వయసు. తెలుగు యువతిలోని అందమూ. అణకువా ఆమెలోనూ వున్నాయి)

జానకి :

కోటప్పా—

కోటప్ప :

ఎవరది (లేచి) ఓ ! దొరసాని గోరా ! ఏవమ్మా ఇల్లా వచ్చారు ?

మహేంద్రం :

(కూచున్న చోటునుంచి లేవకుండానే)- జానకమ్మగారూ ? ఏవమ్మా—దేవుణ్ణి సూసుకు పోదామని వచ్చారా ?

జానకి :

అది నీ కనవసరం.

మహేంద్రం :

నీ దేవుడికోసమే నేనూ వచ్చింది.

జానకి :

మా దేముడు నీలాంటివారికి కనిపించడు.

మహేంద్రం :

కనుపించనూ కనుపించాడు; పారిపోనూ పారి పోయాడు.

జానకి :

ఏం కోటప్పా ?

కోటప్ప :

మీ దేవుడెవరో నాకు తెలీదు తల్లీ.

(ఇంతలో దూరంగా 'మహేంద్రం' అన్న ఒక పిలుపు, కొంచెం సేపుండి 'కోటప్పా' అన్న మరో కేక.)

జానకి :

అయ్యో ! అయ్యో ! మానాన్న ఇటే వస్తు న్నారు. కోటప్పా, అదిగో ఆ గర్భగుడిలోకి వెళ్ళి

దాక్కుంటాను. దయచేసి, దయచేసి మా నాన్నతో ఆ సంగతి చెప్పనీకేం?

మహేంద్రం :

(లేచినుంచుంటూ) ఎక్కడికి వెళ్తారు జానకమ్మా? ఎందుకూ అయ్యగార్ని చూత్తే అంత బయ్యం?

జానకి :

వారికి, వారికి, నే నిక్కడి కొచ్చినట్టు తెలీకూడదు.

మహేంద్రం :

(మెల్లిగా గర్భగుడి ముందుకు వెళ్ళి ద్వారాన్ని అటకాయిస్తూ) ఏం తెలిత్తే?

కోటప్ప :

(తనూ లేచి నుంచుంటూ) ఒరేయ్! అడ్డు లేరా.

(ఇంతలో ఎడమవేపునుంచి కనకయ్య ప్రవేశం. ఒడ్డూ, పొడుగూ వున్న మనిషి. ధోవతి, సిల్కులాల్చీ, ఆకు చెప్పులు చేతిలో పొన్నుకర్ర. మనిషి తెల్లటివాడు. మెడలోవున్న సన్నని బంగారు గొలుసు, లాల్చీలోనుండి కన్పిస్తుంటుంది. మనిషిలో నలభై - యాభై సంవత్సరాల మధ్యనున్న వయస్సులోని హుందాతనం.)

కనకయ్య :

మహేంద్రం! (జానకిని అప్పుడే చూస్తూ) జానకీ! నువ్వా - ఇక్కడా?!

మహేంద్రం :

దండాలుబాబు !

**(ఇదంతా చూస్తూకూడా కోటప్ప చలనం లేకుండా ఓ మూలకు పోయితుప్పమీదకూచుని మామూలుగా బీడీ కాల్చుకుంటున్నాడు)**

కనకయ్య :

(**జానకితో**) ఎందుకొచ్చావిక్కడికి ? (**జానకి మాట్లాడదు**) నిన్నే ప్రశ్నిస్తున్నది. నోరు లేదూ ?

మహేంద్రం :

దేవుణ్ణి సూట్టాని కొచ్చారు బాబూ.

కోటప్ప :

నోర్మూయ్.

కనకయ్యా :

నే నిక్కడ వున్నానన్న సంగతి మర్చిపోకు కోటప్పా. కొంచెం ఒళ్లుదగ్గరపెట్టుకొని మాట్లాడు.

కోటప్ప :

(**ప్రశాంతంగా**) ఆ రోజులు పోయినయ్ బాబూ.

**(కనకయ్య యీసమాధానానికి కళవళ పడిపోయి, తమాయించుకుని మహేంద్రం వేపు 'ఏవిటి' అన్నట్టు కళ్ళతోనే చూస్తాడు.)**

మహేంద్రం :

ఇదివరకటి కోటప్ప సచ్చిపోనాట్ట. యీడుమరోడు.

కనకయ్య :

ఉహూ. (జానకితో) ఇంటికిపద. (జానకి బయల్దేరుతుంది)

కోటప్ప :

నేనూ ఒత్తున్నాను, వుండండమ్మగోరూ. సీకటి పడ్డది. మిమ్మల్నింటికాడ దిగడిసి, నా గుడెసెకు పోతాను.

కనకయ్య :

కోటప్పా-నీతో పనుంది.

కోటప్ప :

సీకట్లో ఏంపన్లు బాబు. ఎలుగు పానీండి. మాట్టాడు కుందాం. రండమ్మా ఎళ్దాం.

(కోటప్ప జానకితో వెళ్ళిపోతాడు. కొంచెంసేపు నిశ్శబ్దం)

మహేంద్రం :

ఆడు మారిపోనాడు బాబూ.

కనకయ్య :

(చుట్ట వెలిగించుకుంటూ) మారి పోయినాడా ? అదేమిటి ?

మహేంద్రం :

ఆడిక మీ కొలువులోకి రాడు. నే సెప్పినట్టు వినడు. (నవ్వుతో) దేవుడిముందు కూసుని 'దేవుడా ! నన్ను మంచివాణ్ని సెయ్' అని పేర్దిత్తుంటాడు.

కనకయ్యా :

ఆ చెప్పేదేదో వివరంగా చెప్పు.

మహేంద్రం :

(దగ్గరకొచ్చి, పరకాయించిచూసి) ఆడిక మన మన్సికాదు బాబూ.

కనకయ్యా :

అయితే....

మహేంద్రం :

బయంనేదుబాబు. మాటున్నాడంటే ఆడిక ఎనక్కి తిరగడు. ఆడి నోట్టోంచి నువ్వుగింజంతకూడా బైటికిరాదు. మనకాబయం అక్కర్లేదు. కానీ ఒకటే ఇసారంగా వుంది.

కనకయ్యా :

(పాలిపోయి) ఏమిటి ?

మహేంద్రం :

ఆడు లేకపోవటం మూలాన కుడిసెయ్యి తెగిపోయి నట్లయింది. ఆలోసనా పాలోసనా లేనిమనిషి. ఏం సెపితే అది దున్నపోతుల్లా సేసేవాడు. ఇప్పుడు నేను వంటరి వాన్నైపోనాను.

కనకయ్యా :

ఏం ? నువ్వూ వెళ్ళిపోదల్చుకున్నావా ?

మహేంద్రం :

అది ఈ జన్మకు లేదుబాబూ! సావో, బెతుకో మీతోనే ముడెట్టుకుంటాను. దయిర్యం గలోడికి ఒక్కసారే సావు.

కనకయ్యా :

సెహభాష్! నిన్ను నావాడు అని చెప్పుకోవడానికి నిజంగా నాకు చాలా సంతోషంగా, గర్వంగావుంది. నీలాంటివాడు ఒక్కడు నా పంచన మిగిలివున్నా - (నవ్వు) — నువ్వే చూస్తావుగా! కోటప్ప వెళ్ళిపోయాడన్న వార్త చాలా విచారకరమైంది. కానీ నువ్వింకా నా వంకే వున్నావన్న సంతోషం ఆ విచారాన్ని మింగేస్తుంది. తీసుకో! తీసుకోవోయ్! సంతోషంగా యిస్తున్నాను తీసుకోవోయ్! (మెళ్ళో వున్న **ఒంటిపేట గొలుసు యివ్వబోతాడు.**

మహేంద్రం :

లంచం ఇస్తుండారా?

కనకయ్యా :

ఛా! ఛా! యింతకన్నా మరేమీ యిచ్చుకోలేని నా అసమర్థతకు సిగ్గుపడుతూ, బహుమతిగా నీకు దీన్ని యిస్తున్నాను. లంచమా? నీకా? నేనా? ఇట్లా ఎందుకు ఆలోజిస్తారోయ్ మనుషులు! చెప్పిన

పని చేశావ్, ఒక్క గడ్డిపరకయినా మిగల్చకుండా స్వాహా చేయించావ్! ఆ! చూడు, కోటప్ప యిలా మారిపోవడానికి ఎవరు కారణం ?

మహేంద్రం :

శివయ్య.

కనకయ్య :

శివయ్యా ! (నవ్వుతో) ఇప్పుడాయన పశువులు మేత లేక చచ్చిపోతాయి. ఇహ ఆయన నీడలేక చచ్చి పోతాడు.

మహేంద్రం :

కానీ, శివయ్యమీద సెర్య తీసుకోటం కష్టం దొరా.

కనకయ్య :

ఆ! గడ్డిపరక.

మహేంద్రం :

కాద్దొరా ! మఱ్ఱిసెట్టు. కోటప్ప, ఆయనకు నీడలాగా పాముపడగలాగా ఎన్నంటి వున్నాడు.

కనకయ్య :

అట్లాగా !

మహేంద్రం :

ఆలోసించండి దొరా భుజంగరావుగారితోటి ఆలోసించండి. ఆయన మెదడుకు తట్టని ఆలోచనలేదు.

కనకయ్య :

అవును ! భుజంగరావ్ ! సమయానికి జ్ఞాపకంచేశావు. ఈసరికి పట్నంనుంచి వచ్చివుంటాడు.

ఆ విషయం ఏం చేశాడో ? వస్తాను. మహేంద్రం ! జాగ్రత్త ! వాళ్ళేం ఎత్తులు వేస్తున్నారో ఏమో ! వాళ్ళను నమ్మకూడదు సుమా ! పైకి ఎంతమంచిగా కనుపిస్తుంటారో అంతగా గోతులు తీస్తూవుంటారు. వస్తాను. ఆఁ నువ్వెందుకూ యిక్కడ ? ఇహ ఆ కుర్రకుంక ఇవ్వాళ యిక్కడకు రాడులే.

మహేంద్రం :

ఏమో, సెప్పలేం, వత్తే రానూవచ్చు. ఎందుకైనా మంచిది, నేనిక్కడే పొంచుంటానుదొరా. జెంతువును సూసి పులి దూకాలి.

కనకయ్య :

అన్నట్లు గురవయ్య సెట్టికి కబురుచేశావా ?

మహేంద్రం :

మద్దానమే సెప్పా దొరా ! పొద్దున్నే మిమ్మల్ని కలుసుకోమని.

కనకయ్య :

బావుంది. జాగ్రత్త సుమా. వెళ్లొస్తాను. (వెళ్ళిపోతూ) ప్రొద్దున్నే నువ్వు నాకు ఒకసారి కనపడు. **(వెళ్ళిపోతాడు)**

మహేంద్రం :

(కనకయ్య పోయినవేపే చూస్తూ) దొరా ! లోకం కంటికి నేను సెడ్డోణ్ణి. మీ కంటికి నేను బహుమంచోణ్ణి. మరి ఈ దేవుడి కంటికి ? (పెద్దగా నవ్వుతూ) ఏం దేవుడూ ?—ఏవంటావ్ నువ్వు, అవున్లే నువ్వేం సెప్పగలవ్ ? రాతి దేముడివి. ఏం సెప్పినా మను షులం, బతికున్నవాళ్ళం మేం సెప్పాల హా.హా.హా. (శివలింగం ముందుకువెళ్ళి ఆ దేవుడివేపే చూస్తుంటాడు కొద్ది కాలం) సూద్దాం నీదో గెలుపు, లేక మాదో గెలుపు ? నువ్వు గెలిత్తే మేం మాయ, మేం గెలిత్తే నువ్వు మాయ. వూ ! ¡ ?

(ఒక రాతిమీద కూర్చుని శూన్యంలోకి ఏదో ఆలోచిస్తూ చూస్తూండగా)

(తెర)

# పద్మవ్యూహం

## ద్వితీయాంకం

ఇంకా బాగా తెల్లవారలేదు. కరిగిపోతున్న చంద్రుడి వెలి తెలికాంతి. హాల్లో వంటరిగా ఓ స్టూలుమీద కూచుని కనకయ్య తనకుతానే చదరంగం ఆడుకుంటున్నాడు. గోడలకు ఇక్ష్వాకుల నాటి దేముళ్ళ పటాలూ, క్రింద పేముకుర్చీ ఒకటీ, పడకకుర్చీ ఒకటీ కొయ్యకుర్చీలు రెండూ, కుడివేపుగా గోడకు ఆనించబడి ఓ పట్టెమంచం, సరిగ్గా హాలుకు మధ్యగా పైనించి ఓ ఇనుపతీగ వేలాడుతూ, దానిలో లాంతరు తగిలించబడి వుంది. ఆ లాంతరు వుండివుండి గప్పుమంటున్నది. కనకయ్య జుట్టంతా రేగి వుంది. కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. తదేకంగా అటువేపే చూస్తున్నాడు.

*కనకయ్య* :

(ఉన్నట్టుండి లేచి) ఒరేయ్ రఘూ—ఏది వెయ్‌రా, వెయ్యి. ఎత్తువెయ్. (తనువున్న స్థానంలోంచిలేచి ఎదుటి స్థానంలోకి వెళ్ళి కూచుని) ఎత్తు వెయ్యాలికదూ, ఇదిగో వేస్తున్నాను. మంత్రి నీ గుర్రం ఎగిరిపోయింది. (మళ్ళీ తన మొదటి స్థానంలోకి వచ్చి కూచుని) గుర్రాన్ని తీసేశావూ, గొప్పచిక్కేవచ్చిందే, ఇదిగో శకటంవేసి

నీ మంత్రిని....(రెండవ స్థానంలోకి తొందరగామారుతూ) ఆగాగు ఏమిటూ తొందర అక్కడనుంచి శకటంను తీసేస్తే నీ రాజు 'షా' కాదూ? (మొదటి స్థానంలోకివచ్చి) అరి భగవంతుడా! ఏం చేసేదిరా?

**(బయట కాకులు కావుమనడం, తెల్లవారడం, గదినిండా తెల్లని ఎరుపు కాంతి ఆవరించుకోవడం అన్నీ మెల్లమెల్లగా)**

కనకయ్య:

(లేస్తూ) ఏమి చెయ్యడమని (కొంచెం మవునం) ఈ కాకుల గోలఒక్కటి పులిమీద పుట్రబాపతుగా అవును కాకులలాటివాళ్ళే ఈ ప్రజలు. ఇంత మేతపడేయాలి. **(కూచుంటూ చదరంగం బల్లవేపు చూసి)** పోనీ మంత్రిని తీసికొనివచ్చి ముందుపెత్తే? ఆ అవును. అదీ చేయవలసింది. అబ్బే—లాభంలేదు. ఈ మంత్రి ఊఁ .... వూట్టి మాటలపోగు.

**(లోపలనుంచి ఒక ముసలిగొంతు)**

తినరా. ఈఒక్క జిలేబీముక్కతినరా, నామాటవిన్రా.

**(పసిపిల్లాడిలాంటి ఇరవైయేళ్ళ అబ్బాయి కంఠం :—)**

ఒద్దే—నా కొద్దంటేనూ.

**(లోపల్నుంచి సుబ్బారాయుడు పరుగెత్తుకునివచ్చి, అమాంతం కనకయ్య మెడమీద రెండుచేతులూ వేసి, చదరంగం బల్లను క్రిందకు తోసేస్తూ)**

సుబ్బారాయుడు :

మావయ్యా! కనకయ్య మావయ్యా! చూశావా, చూశావా, నాన్న ఏం చేస్తున్నాడో?

కనకయ్య :

ఏం చేస్తున్నాడ్రా?

సుబ్బారాయుడు :

నాకొద్దే అంటుంటే జిలేబీ పెడతానంటున్నాడు

(లోపల్నుంచి అచ్చు రమణారెడ్డిలా వుండే భుజంగరావు ఓ ప్లేటులో ఇన్ని జిలేబీలు తెచ్చి కొడుక్కు దగ్గరగా వస్తూ)

భుజంగరావు :

నా నాయనే, నాబాబె! ఈ ఒక్కటీ తినమ్మా. జిలేబీలంటే నీ కిష్టమని అంత దూరంనుంచి పట్టుకు వచ్చాన్రా.

కనకయ్య :

ఏమిటి బావా యిది? పేరుకు భుజంగానివే కాని కొడుకు దగ్గరకు వచ్చేసరికి మాత్రం మండూకానివై పోతున్నావ్.

భుజంగరావు :

ఏమిటో— అమాయిక బిడ్డ! ఆలనా పాలనా? ఏరా నామాట వినవ్? ఈ ఒక్క జిలేబిముక్కా తినవ్?

సుబ్బారాయుడు :
(బుంగమూతిపెట్టి) వూ....హూ....

కనకయ్య :
తప్పు నాయనా అలా పెద్దవాళ్ళను ఎదిరించ కూడదు. పెట్టిందేదో గుట్టు చప్పుడు కాకుండా తినేయాలి.

సుబ్బారాయుడు :
ఎన్ని తినేదేవిటీ ?

భుజంగరావు :
ఎన్ని తిన్నావేమిటీ ?

సుబ్బారాయుడు :
(లెక్కపెట్టుకుంటూ) ఒకటి....రెండూ....మూడూ.... అయిదూ....పదీ....పదకొండూ....ఇరవై.

భుజంగరావు :
నీమొహం. లెక్కలూ రావు బండలూ రావు. నేను తెచ్చినవే ఇరవై లేవు.

సుబ్బారాయుడు :
అవున్లే. నాకు లెక్కలూరావు, బండలూరావు, నీకు మహావచ్చినట్టు. మొన్న అరత్తికిఅయిదురూపాయలు ఇయ్యమని పంపిస్తే "ఇదేంటే, బాబుగారు నాకు

రెండు రూపాయలే ఇయ్యాలే - అయిదెందుకు పంపించారూ” అన్నది.

*భుజంగరావు :*

ఛా ! పో ! వెఱ్రివెధవా అని. ఎక్కడేం మాట్లాడాలో కూడా తెలీదు.

*సుబ్బారాయుడు :*

నేను వెఱ్రివాణ్ణా ? నన్ను వెఱ్రివాడనుకొనే వాళ్లు వెఱ్రివాళ్లు. (**అలిగి ఓ మూలకు పోయి కూచుంటాడు**)

*కనకయ్య :*

భుజంగరావు బావా ! పిల్లవాణ్ణిలా పాడుచెయ్యక పోతే, ఏ విశాఖపట్నమో పంపించరాదుటయ్యా. సలక్షణంగా తిరిగొస్తాడు కుఱ్ఱాడు.

*భుజంగ రావు :*

కనకం బావా ! నువ్వా అదేమాట మాట్లాడుతున్నావా ? వాడికేం పిచ్చివుందని చెప్పు ? ఏదో అమాయకుడు కాని, (**కళ్ళనీళ్ళ పర్యంతమై**) అయినా అదేబ్రతికివుంటే వాడికిన్ని తిప్పలూవచ్చేవి కావు. నేనూ వాడూ మీయింట్లోకూచుని తింటూ-

*కనకయ్య :*

ఛా ! ఛా ! నాకదేంలేదు బావా, ఏదో ఇంత భగవంతుడు తినా, కుడవా ఇచ్చాడు. మహారాజుగా

వెళ్ళిపోతోంది. అయినా ఈ సంపత్తంతా అయిన వాళ్ళకు కాకపోతే పరాయివాళ్ళకా భుజంగం ?

*భుజంగరావు :*

ఆ ఉద్దేశ్యంతోనే నేనూ ఇక్కడ వుంటున్నాను. కానీ ఈ పల్లెటూళ్ళో వుంటున్నకొద్దీ వీడు మరింత అమాయకుడు కావడం తప్ప -

*కనకయ్య:*

హుమ్ ! మరో భావన రానీబోకు భుజంగం. నువ్వూ నేనూ ఒకటి ఏంచేసినా, ఏం అనుభవించినా ఇద్దరం ఒకటిగా అనుభవించాలి. పోనీ వాడు ఖాళీగా కూచుని చెడిపోతున్నాడని నీకుఅనుమానంగా వుంటే — ఇంటర్మీడియట్ తప్పి ఏం చేడానికీ తోచక, గోళ్ళుకొరుక్కుంటూ మన వూళ్ళోనే తిరుగుతున్న వాళ్ళు చాలామంది వున్నారుగా — వాళ్ళ దగ్గర ట్యూషన్ చెప్పించు.

*భుజంగరావు :*

భేషుగ్గా వుంది. ఏరా నాయనా, చదువుకుంటావా ?

*సుబ్బారాయుడు :*

చదువా ! !-చదువెందుకూ నాకు ?

*భుజంగరావు :*

అదేమిట్రా నాయనా, చదువు చెప్పిస్తానంటే వద్దంటావా ?

సుబ్బారాయుడు :

చదువురానివాళ్ళకు చదువు కావాలి. కాని నాకెం దుకూ ?

భుజంగరావు :

నీ మొహం. ఒక్క లెక్కారాదు. ఒక్క ఇంగ్లీషు ముక్కరాదు. ఒక్క తెలుగు పద్యం రాదు.

సుబ్బారాయుడు :

మావయ్యా—

కనకయ్య :

ఏం అల్లుడూ ?

సుబ్బారాయుడు :

నాన్న అబద్ధం చెబుతున్నాడు.

భుజంగరావు :

హారి వెర్రిపీనుగా ! నే నబద్ధాలు చెప్పడం ఏవిట్రా ?

సుబ్బారాయుడు :

మరి నాకు తెలుగు పద్యాలు వచ్చుగా.

భుజంగరావు :

వచ్చా ? ఏదీ ఒక సుమతీశతకం వచ్చునా ? ముద్దుకు ఒక రుక్మిణీ కళ్యాణం వచ్చునా ? గజేంద్ర మోక్షం వచ్చునా ? ఏమొచ్చురా నీకు ?

సుబ్బారాయుడు :

అన్నీ వచ్చు.

భుజంగరావు :

ఏదీ నాయనా — (మురిసిపోతూ) ఒక్కటి ఒక్కపద్యం చదివి వినిపించు.

సుబ్బారాయుడు :

(పొంగిపోతూ)

గంగిగోవుపాలు కడివెడైన నేమి
గంటెడైనను చాలు ఖరముపాలు

భుజంగరావు :

నీ మొహంలా వుంది.

సుబ్బారాయుడు :

చూశావా మావయ్యా, నాన్నెప్పుడూ నన్ను మెచ్చుకోడు.

కనకయ్య :

నాన్నకేవీ తెలీ దల్లుడూ !

సుబ్బారాయుడు :

అయితే నేనూ నువ్వూ ఒక జత. కోతి కొమ్మచ్చి, బిళ్ళంగోడు, చెడుగుడు, నా కొచ్చిన ఆటలన్నీ నీకు నేర్పుతా. కోమటి గురవయ్య కొట్లో శనగ పప్పు కొనుక్కుతింటం, ఆచారిగారి తోట్లోంచి

ఎవ్వరూ చూడకుండా మామిడికాయలు కోసుకు రావడం, శివయ్యగారి దగ్గర బుద్ధిగా కూచుని పద్యాలు నేర్చుకోడం.

భుజంగరావు :

శివయ్య దగ్గరా ?

సుబ్బారాయుడు :

ఆఁ ! ప్రతిరోజూ గుళ్లో భాగవతం చదువుతున్నారు కదూ. నిన్న నేనూ వెళ్ళాను నాన్నా. శివయ్య గారు ఎంత బాగా చదువుతారో ! ఆయన చదువు తుంటే.... నాన్నా ! నేను పద్యాలు రాయద్దూ ?

కనకయ్య :

రాసెయ్ అల్లుడూ, నేను ప్రింట్ చేసేస్తాను.

సుబ్బారాయుడు :

వూరికే ఎట్లారాయడం ? నిన్న శివయ్య గార్నడిగితే 'దేవుడి వరంలేంది రాదు నాయనా' అన్నాడు. (కొంచెంసేపు వూరుకుని)నాన్నా, మావయ్య ! మీరింత పెద్దవాళ్ళు కదా, దేవుడివరం నాకిప్పించలేరూ?

భుజంగరావు :

సరేగాని నాయనా, ఇంకా ఏమేమిటి చెప్పాడూ శివయ్య నీకు ?

సుబ్బారాయుడు :

ఓ! చాలా చెప్పాడు.

కనకయ్య :

(ఆశగా) ఏమేం చెప్పాడూ?

సుబ్బారాయుడు :

అబ్బో! చాలా చెప్పాడు. నాకేం జ్ఞాపకానికి లేవు. (ఆలోచిస్తూ) ప్రతిరోజూ గుడికి వెళ్ళమన్నాడు. మౌనంగా వుండాలన్నాడు. ఆకలిగా లేనప్పుడు తినకూడదన్నాడు.

కనకయ్య :

ఇంతేనా ?

సుబ్బారాయుడు :

ఇంకా వున్నాయి. జ్ఞాపకం లేవు.

కనకయ్య :

అయితే ఇటు చూడు. ఈసారివెళ్ళు. వాళ్లు చెప్పే వన్నీ బాగా జ్ఞాపకం వుంచుకో. వచ్చి మాతో చెప్పు. ఏం ?

సుబ్బారాయుడు :

ఎందుకు చెప్పాలి ?

భుజంగరావు :

చెప్పాలి నాయనా. అంతే.

కనకయ్య:
చెబితే నీకేం కావాలంటే అదిస్తాను.

సుబ్బారాయుడు :
జానకి నిస్తావా?

కనకయ్య:
(తబ్బిబ్బు పడిపోయి, తమాయించుకుని) ఓ!

సుబ్బారాయుడు :
ఇద్దరం ఎంచక్కా ఆడుకోవచ్చు.

కనకయ్య :
మరి చెప్తావ్ కదూ?

సుబ్బారాయుడు :
ఓ. ఇప్పుడే (పరుగెత్తుకుని వెళ్ళిపోబోతాడు)

భుజంగరావు :
(అడ్డుకుంటూ) ఒరేయ్ ఈ ముక్క తినిపోరా.

సుబ్బారాయుడు :
నాకేంవద్దు, నువ్వే తిను.
(వెళ్ళిపోతాడు. కొంచెం నిశ్శబ్దం)

భుజంగరావు :
నాకు వీణ్ణి గురించేనయ్యా వున్న ఆలోచనా, విచార మూను. అది పోయినప్పుడు కూడా నా కింత

బాధ అనిపించలేదు. కానీ ఈ అమాయకుడు, ఎల్లా బతుకుతాడు వీడు ? ఆస్తా — ఆస్తివుంటే నీ పంచన చేరేవాళ్ళమే కాదు. నే పోయింతర్వాత వాడి అవసరాలు చూడటానికి పెళ్ళామా — ఆ గీత వాడికి లేదు.

కనకయ్య :

బావా ! నువ్వా దిగులేవీ పెట్టుకోనక్కర్లేదు. నీకన్నా నాకు మాత్రం అప్తు లెవరు ? జానకిని ఏడికిచ్చి చేస్తాను.

భుజంగరావు :

హరిహరీ ! అంత పాపపు మాట ఎందుకనుకుంటావు బావా ? అది మాత్రం నా మేనగోడలు కాదూ ? చూస్తూ చూస్తూ దానిగొంతు నేను మాత్రం కోయగలనా ? చచ్చి స్వర్గానవున్న నా చెల్లెలు ఎంత తిట్టుకుంటుంది ?

కనకయ్య :

చచ్చినవాళ్ళకోసమని, బ్రతికివున్న వాళ్ళ విషయం ఆలోచించడం మానుకుంటామా భుజంగం.

భుజంగరావు :

అవును మానుకోము. కానీ, ఈ విధంగా కాదు.

*కనకయ్య :*

మరింకే విధంగా ?

*భుజంగరావు :*

నాచేత చెప్పించాలని చూస్తున్నావు. కాని, నీకు మాత్రం తెలీదూ ?

*కనకయ్య :*

చెప్పుబావా, — నాదగ్గర నీకు దాపరిక మెందుకు ?

*భుజంగరావు :*

అహఁ ఏం లేదు. ఈ ఆస్తీ, ఈ డబ్బూ, ఈ నగలూ ఇవన్నీ ఎప్పట్నుంచి సంపాయించావు ?

*కనకయ్య :*

(**అమాయకంగా**) నాచేత చెప్పించాలని కాకపోతే నీకు మాత్రం తెలీదా భుజంగం. నువు కాలుబెట్టావు. నాయింట్లో లక్ష్మి నృత్యంచేసింది. నువు నాకు అండగా నిలబడ్డావు. నాకీ పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. నువు కన్నుతెరిచావు. నా శత్రువులు మలమలమాడి మసైపోయారు.

*భుజంగరావు :*

ఈ పొగడ్తలకేంలే ? — అయితే ఈ ఆస్తంతా నీ స్వార్జితమేనంటావ్ ?

కనకయ్య :

నాదికాదు. నీ స్వార్జితమంటాను.

భుజంగరావు :

అంటావా ?

కనకయ్య :

ఎందుకు అననూ.

భుజంగరావు :

మాట తిరగవుకదా ?

కనకయ్య :

అనుమాన మెందుకు బావా.

భుజంగరావు :

అయితే ఒక పాతిక ఎకరాలు మా సుబ్బులిపేర రాసెయ్.

కనకయ్య :

(**కలుక్కుమని....ఆలోచించుకుని**) వెధవపాతిక ఎకరాలు, నాపిల్లనే ఇచ్చేస్తుంటే, ఈమాత్రందానికి వెనకాడతా ననుకున్నావా ?

భుజంగరావు :

పిల్లవద్దు బావా ! .... ఆస్తి కావాలి.

కనకయ్య :

(కోపంగా) పిల్ల కేం లోపమయింది ?

భుజంగరావు :

(ప్రశాంతంగా) అది వాడితో కాపురం చేయదు.

కనకయ్య :

బావా....

భుజంగరావు :

బావా ! నన్ను కళ్లు గప్పుదామను కున్నావా ? నీ పిల్లకు ఆ రఘుపతి మీద మనసు వున్న సంగతి నాకు తెలుసు. నువ్వు ఆ రఘుపతిని అడ్డు తొల గించు కోవాలనుకుంటున్న సంగతీ నాకు తెలుసు. అడ్డు తొలగించుకుని, నాచేత నీ పన్లు చేయించు కుని....

కనకయ్య :

బావా....

భుజంగరావు :

అలా పిలవబోకు. నీకు నువ్వు స్వతంత్రించి, నా సలహా లేకుండా ఎప్పుడు నువ్వీ వ్యవహారంలో కోటప్పనూ, మహేంద్రాన్ని నియమించుకున్నావో అప్పుడే వ్యవహారం సర్వనాశనమైంది.

కనకయ్య :

క్షమించు బావా. ఆవేశపడిపోయాను.

భుజంగరావు :

అవును. ఈ ఆవేశం నీకు ముందుకూడా వుండ దని నాకు నమ్మకమేమిటి ? దీపముండగానే ఇల్లు చూసుకోవాలి. ఆ పాతిక ఎకరాలూ మా సుబ్బు లికి ఇచ్చేసెయ్. నీకు దేవాలయానికి ట్రస్టీషిప్ వస్తుంది. పంచాయతీబోర్డు ప్రెసిడెంటువూ అవు తావు. శెట్టి దగ్గర నువ్వు చేసిన అప్పూ తీర్తుంది. రఘుపతి ఇహ నీకు అడ్డురాడు.

కనకయ్య :

ఆగు. బెదిరిస్తున్నావా ?

భుజంగరావు :

లేదు. పరిస్థితిఇది అని చెప్తున్నాను. తెలివిగలవాడవైతే ఇస్తే ఇయ్యి.

కనకయ్య :

లేకపోతే ....

భుజంగరావు :

నేనంత చేతగానివాణ్ణి కాదు. (మవునం) సరే వెళ్తున్నాను. (గుమ్మం దాకా వెళ్తాడు.)

కనకయ్య :

ఆగు. ఆ పొలమేగా నీకు కావలసింది

భుజంగరావు :

మరోసారి చెప్పాలా ?

కనకయ్య :

సరే ఇస్తాను.

భుజంగరావు :

బావుంది. అల్లాచెప్పావు బావుంది. (దగ్గరకు వచ్చి) ఎక్కడయినా బావ అనుకో.... ఆ సామెతను విన లేదూ. (కూచుంటాడు) (ఇంట్లోంచి రేడియో సంగీతం)

కనకయ్య :

జానకీ !

జానకి :

(ఇంట్లోనుంచి దూరంగా) ఆఁ!

కనకయ్య :

ఆ రేడియో కొంచెం పెద్దది చేయమ్మా. (కొంచెం వున్న తర్వాత వాల్యూము పెద్దదవుతుంది)

(రేడియోలోంచి పద్యం :)

ధరణి కొరకును దండ్రి సోదరుల నెల్ల
జంపుటన్నది యుండు మ్లేచ్ఛ జనవృత్తి

మంత్రి జనుల యిష్టంబుగా మహిని దమ్ము
డైన బొందగ జనుట యార్య జనవృత్తి.

కనకయ్య :

(పెద్దగా) జానకీ! ఆపేసెయ్! వెధవ రేడియోనూ వెధవ సంగీతమూనూ.

(రేడియో సంగీతం ఆగిపోతుంది.)

భుజంగరావు :

సంగీతాన్ని ద్వేషించి ప్రయోజన మేమిటి? మనుషులను ద్వేషించి, ప్రేమించి మచ్చిక చేసుకోడం చాతకాకపోయింతర్వాత....

కనకయ్య :

ఆఁ!....

భుజంగరావు :

అవును. హంతకులకు ద్వేషమేకాని అభిమానం వుండకూడదు.

కనకయ్య :

ఆఁ!....

భుజంగరావు :

అవును కార్యాన్ని సాధించుకోవాలన్న ఆలోచనే వుంటే అందరూ నీకు శత్రువులే.

కనకయ్య :

ఆఁ!

భుజంగరావు :

అవును ఈ భుజంగరావు, నీ జానకీ, జానకికి చెందిన రఘుపతి, రఘుపతంటే ప్రాణాలిచ్చే శివయ్య, శివయ్యకోసం చచ్చిపోడానికని సిద్ధపడుతున్న కోటప్ప, కోటప్పమీద ఇంకా అభిమానం చచ్చిపోని మహేంద్రం, మహేంద్రం అంటే అభిమానం చూపించే కనకయ్య.

కనకయ్య :

బావుంది. చివరకు నాకు నేనే శత్రువునే.

భుజంగరావు :

అవును. కార్యసాధనకు మొదటి శత్రువు ఎవరో తెలుసా. అతనిలోని దౌర్బల్యమే. అది తొలగించుకోవాలి.

కనకయ్య :

వూఁ....హూ....

భుజంగరావు :

ఆ తర్వాత ముందుచూపుతోబాటు, వెనకరాగల ఫలితాలను సమీక్షించుకోగల తెలివితేటలుకూడా వుండాలి.

కనకయ్య :

(ఎగతాళి ) నాకవిలేవు. ఒప్పుకొంటున్నాను.

భుజంగరావు :

ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు చాలా సంతోషంగా వుంది. (మవునం) ఎవరో నీలాంటి మూర్ఖుడుతప్ప ఎవరైనా, ఎక్కడైనా, పట్టపగల్లాంటి వెల్తురులో, నలుగురూవున్న శివాలయం దగ్గర ఒక మనిషిని చంపడం కోసమని, ఇద్దరు మనుషుల్ని నియోగిస్తాండా ?

కనకయ్య :

పొరపాటే అయిపోయింది భుజంగం.

భుజంగరావు :

ఇంకా నయం. నువ్వనుకున్నపని నెరవేరలేదు. నువ్వు ఒడ్డునపడ్డావు. లేకపోతే ఈసరికి నువ్వు సుఖంగా శ్రీకృష్ణ జన్మస్థానంలో —

కనకయ్య :

అట్లాఆపదకు దూరంగా వుంచుతావనేకదు భుజంగం నీకు నిక్షేపంలాంటి చెరువుపొలం పాతిక ఎకరాలూ ఇయ్యదల్చుకుంది.

భుజంగరావు :

పొరపాటు. ఆ పొలం అందుకు బహుమతి కాదు.

సంవత్సరానికి పన్నెండు వేలరూపాయల ఆదాయం వున్న శివాలయానికి నిన్ను ట్రస్టీగా గవర్నమెంటు వారిచేత నియమింప చేసినందుకు.

*కనకయ్యా :*

ఆఁ! నిజంగా.

*భుజంగరావు :*

ఆహా. అక్షరాలా, నిన్నరాత్రనగా వచ్చాను. మాట వరుసకైనా అడిగావా, వెళ్ళినపని ఏమయిందని.

*కనకయ్యా :*

నీమీాద నాకామాత్రం నమ్మకం లేకపోలేదు.

*భుజంగరావు :*

ఓహో ! అందుకనే గామోసు, నిన్న సాయంకాలం నీకునువ్వే చేతులు కాల్చుకోబోయావు.

*కనకయ్యా :*

బావా ! పొరపాటయిపోయింది. క్షమించు.

*భుజంగరావు :*

క్షమాపణం దాకా ఎందుకు ? ఒకణ్ణి చంపదల్చు కుంటే ఏమేం మార్గాలున్నాయి చెప్పు — మాటవరుసకు అడుగుతున్నాను.

*కనకయ్యా :*

వెనగ్గా కత్తిపెట్టి పొడవచ్చు.

భుజంగరావు :

ఒకటి.

కనకయ్యా :

విషమిచ్చి చంపవచ్చు.

భుజంగరావు :

రెండు.

కనకయ్యా :

నీళ్ళలో ముంచేయ వచ్చు.

భుజంగరావు :

మూడు.

కనకయ్యా :

ఉరితీయవచ్చు.

భుజంగరావు :

నాలుగు.

కనకయ్యా :

ఇంకా ఏమున్నాయబ్బా.

భుజంగరావు :

ఆలోచించు.

కనకయ్యా :

ఏమీా తోచడంలేదు.

భుజంగరావు :

హత్యచేస్తే ఆత్మహత్యలా వుండాలి కనకం. నర మానవుడికైనా అనుమానం రాకూడదు.

కనకయ్య :

అవును.

భుజంగరావు :

ఇటుచూడు. ఎవర్ని ఖర్చు రాయించాలనుకుటుం న్నావ్ నువ్వు ?

కనకయ్య :

మీకు తెలుసుగా.

భుజంగరావు :

అది వేరు సంగతి. నేనడిగినదానికి సమాధానం చెప్పు. ఎవర్ని ?

కనకయ్య :

(మెల్లిగా) ర....ఘు....ప....తి....ని !

భుజంగరావు :

ఎందుకూ ?

కనకయ్య :

అమ్మాయిని ప్రేమిస్తున్నాడు.

భుజంగరావు :

ఇంతేనా ?

కనకయ్య :

కాదు, నే చేసే ప్రతిపనికీ అడ్డొస్తున్నాడు.

భుజంగరావు :

ఇంకా ?

కనకయ్య :

నన్నుగూర్చి విషప్రచారం చేస్తున్నాడు.

భుజంగరావు :

అయితే నీకూ, అతనికీ శత్రుత్వం వుందని ప్రజలకు తెలును.

కనకయ్య :

వూఁ ! తెలిస్తే ?

భుజంగరావు :

కాబట్టి అతను చంపబడిన మరుక్షణం ప్రజలు సహజంగా నిన్ననుమానిస్తుంటారు.

కనకయ్య :

ఆఁ — వెధవ ప్రజలు.

భుజంగరావు:

వూహ్ తప్పు !! నువ్వు ఎన్నితప్పుడు పన్లు చేసినా, వాటన్నింటికీ ఆ ప్రజల ముద్రే వుండాలి. ఇహ అసలు విషయానికి వద్దాం. ప్రజలకు నీమీద అను

మానం రాకుండా వుండాలంటే రఘుపతి చచ్చిపో
కూడదు.

కనకయ్య :
వాడు చచ్చిపోకుండా వుంటే ఎల్లా ? — నన్ను
బ్రతకనీడు.

భుజంగరావు :
అవునయ్యా, చచ్చిపోడు. కానీ చచ్చిపోయిన
వాడికన్నా హీనంగా బ్రతుకుతుంటాడు.

కనకయ్య :
ఎల్లా ?

భుజంగరావు :
నీ కెవ్వరూ లేరనుకో. అహ, నికంటే నీకాడు.
ఎవ్వరూ లేరనుకో. ఒక్కరు మినహాయించి
ప్రాణంలో ప్రాణంగా ప్రేమించిన ఆ వ్యక్తి హరీ
అంటాడు. అప్పుడిహ నువ్వీలోకంలో ఏకాకివి. నా
అన్నవారు లేరు. పిలిచి పలుకరించే వారులేరు.
కాఫీ నీళ్లిచ్చేవారు లేరు. అప్పుడా మానవుడి
బ్రతుకు ?— వూహించుకోగలవా నువ్వు ?

కనకయ్య :
అయితే. ....

భుజంగరావు :

అవును శివయ్య చచ్చిపోవాలి.

కనకయ్య :

శివయ్య ....దేవుడిలాంట శివయ్య !!!

భుజంగరావు :

అవును శివయ్య ! దేవుడిలాంటి శివయ్య, చచ్చిపోతేనే కాని రాక్షసుల్లాంటి మనం బ్రతకలేం. కానీ **(చదరంగం పావులవేపు చూస్తూ)** ఇట్లా వాళ్ళ మంత్రిని తీసి వేసి, వాళ్ళరాజును కట్టించడం ప్రస్తుతానికి అనవసరమనుకో. ఆఁ! అన్నట్టు నే చేసే ప్రతిపనికీ నువ్వు....

కనకయ్య :

నేను నీవాణ్ణి భుజంగం.

భుజంగరావు :

ఏం లేదు. తెల్సుకోడం ఎందుకైనా మంచిదని అడిగాను. సర్లే-ముందుగా బంటునుకదిలిస్తున్నాను. అమ్మాయ్ జానకీ....

**(జానకివచ్చి ద్వారంలో నిలబడింది. మొహంలో విషాదం.)**

జానకి :

ఏం మావయ్యా—పిలిచారు ?

భుజంగరావు :

అహా ఏం లేదమ్మా. మీనాన్న నన్నోసంగతి నిన్న డగమన్నాడు.

జానకి :

అడగండి.

భుజంగరావు :

నాకిష్టం లేదనుకో ఈ పెళ్ళి. కనకయ్‌బావా! నిజంగా చెబుతున్నాను. మావాడి విషయం నాకు తెలుసు. అమ్మాయ్ విషయమూ తెలుసును. అదీ వాడూ రెండూ నాకు రెండుకళ్లు. ఏకన్నుకు నీరు కారినా, నాకేగా దెబ్బ. ఈ పెళ్ళి నాకిష్టంలేదు.

**(కన్నుగీటుతాడు)**

కనకయ్య :

మీ యిష్టాయిష్టాలతో నాకేం సంబంధం లేదు.

**(జానకి మవునంగా వింటుంటుంది)**

భుజంగరావు :

చెప్పమ్మా! ఇటువంటి విషయాల్లో మవునం పనికి రాదు.

కనకయ్య :

చెప్పరాదటే కొయ్యిమొద్దులా నిల్చొబోతేనూ.

జానకి :

నాకీపెళ్ళి ఇష్టంలేదు.

కనకయ్య :

ఇష్టం లేదట ?— ఎందుకనీ ?— వాడికేం లోప మైందీ ?—బంగారం లాంటి కుర్రాడు.

భుజంగరావు :

ఇష్టం లేనప్పుడు బలవంతం చెయ్యకూడదు కన కయ్యా. అది చాలా తప్పు. అమ్మాయి చాలా తెలి వైంది. చాలా సబబుగా సమాధానం చెప్పింది. (దగ్గరకు వెళ్ళి ఆమె జుట్టు నిమురుతూ) పిచ్చి పిల్ల ! దాని మనసులో ఎవరున్నారో నీకేం తెలుసు ?

కనకయ్య :

ఆ ! ఆ ! దానికో మనసట. మనసులో ఎవరో వుండ డమూనూ.

భుజంగరావు :

చెప్పమ్మా. నాతో చెప్పటానికి నీకేం ? నీమనసులో వున్నకోరిక తప్పకుండా నెరవేరేటట్లు చూస్తాను. (మెల్లిగా) ఎవరు ? - రాఘవయ్య గారబ్బాయి చంద్రుడా ? కాదూ సరే. పోనీ పొరుగింటి కిష్టమ్మ కొడుకు కృష్ణమూర్తా ? వాడూ కాదూ. అయితే ఇంకెవరమ్మా ?- ఆ ! తెలిసింది, శివయ్య గారి

రఘుపతి. అవును. (పెద్దగా) అదృష్ట వంతుడవోయ్.
మన అమ్మాయి మనకు తగినవాణ్నే వరించింది.
(జానకి సిగ్గుతో మొహం చాటుచేసుకుంది.)

కనకయ్య :

ఎవరతను ?

భుజంగరావు :

మరెవరో మరెవరో అనుకున్నావా ? ఎవరో అయితే నేనే నాలుగు చివాట్లు పెట్టేవాణ్ని. రత్నం లాంటి అమ్మాయి - బంగారంలాంటి కుర్రవాడు. భేష్ ! బ్రహ్మదేవుడు ముసలివాడైనా మాంచి సరసుడోయ్ !!'

కనకయ్య :

ఎవరతను ?

భుజంగరావు :

ఓహో చెప్పలేదుకదూ. శివయ్య గారింట్లో లేడూ, అతనేనయ్యా, రఘుపతి.

కనకయ్య :

రఘుపతా ?—చాలా సం.... (భుజంగరావు వద్దని తల వూపుతాడు) తాప కరమైన విషయం. ఆస్తిపాస్తిలేని వాడికి,కులంగోత్రం తెలియనివాడికి, ఏవూరునుంచో ఎచ్చి వూరిమీదపడి బ్రతుకుతున్న వాడికి, వూ.... హు, చచ్చినా పిల్లనివ్వను.

భుజంగరావు :

కనకయ్యా ! మరీ అంత పట్టుదల అయితే ఎల్లాగయ్యా ? వ్యవహారంలో బిగువూ, సడలింపూ రెండూ వుండాలి. అహ, తెలీకడుగుతానూ, రఘుపతికేం ? ఈడూ, జోడేనా కావాలిసింది. అందమూ గుణమేనా కావలసింది. ఇహ ఆస్తా ? — మన పిల్లనిస్తే ఆస్తి అతన్దికాదటు ? ఇహ వూరా ? — ఏవూరయితే ఏమో ప్రపంచమంతా ఒకే రాజ్యమయిపోతున్నప్పుడు. ఒప్పుకో. నామాటువిని ఒప్పేసుకో. ప్రేమించిన వాళ్ళనెప్పుడూ బాధపెట్టకూడదూ.

కనకయ్య :

ఏమో అతను మన అమ్మాయిని ప్రేమించాడని ఎల్లా చెప్పగలం ?

భుజంగరావు :

అదా నీ సందేహం ? ఏం అమ్మాయ్ — అతనూ నిన్ను ప్రేమించాడు కదూ. (జానకి తలాడిస్తుంది).

కనకయ్యా :

అది నీకెట్లాతెలుసే ?

భుజంగరావు :

దానికి కాకపోతే నీకు తెలుస్తుందా ? ఏవిటి కనకయ్యా—మరీ చిన్నపిల్లవాడివై పోతున్నావ్.

కనకయ్యా :

ఏమో నాకు నమ్మకంలేదు.

భుజంగరావు :

నీ కళ్ళతో నువు వాళ్ళిద్దరూ మాట్లాడుకోడం చూసి, నీ చెవుల్తో నువు రఘుపతి జానకితోటి "జానకీ! నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అనడం వినాలంటావ్. ఏవమ్మా జానకీ - పోనీ అలాంటి ఏర్పాటేదేనా చేయించరాదూ ?

(జానకి నవ్వుతుంది)

కనకయ్యా :

నవ్వడంకాదు, నిదర్శనం కనబడాలి.

భుజంగరావు :

అమ్మాయ్, మీ నాన్నకూ నీకు తగాదా ఎందుకూ? ఓ చిన్న చీటీముక్కరాయ్. ఇవ్వాళ సాయంత్రం అతన్ని ఇక్కడికి రమ్మనమని. నేనూ మీ నాన్నా ఆ గదిలో, అదిగో ఆ ప్రక్కన వుంటాం.

జానకి :

చీటీయా ?

భుజంగరావు :

అందులో ఏముందమ్మా. వూరికే రమ్మనమనేగా. మేంప్రతిరోజూ ఎంతమందికి ఎన్నిచీట్లు రాసుకోడం

లేదూ. ఇట్రా ఇటువచ్చికూచో. నేచెబుతాను. కనకయ్యా - ఓ కాయితం ఇయ్యి అమ్మాయికి. కలంగూడా. ఆ! ఇహ రాయమ్మా.

(జానకి రాయడం మొదలెట్టింది భుజంగరావు చెబుతుంటాడు)

*భుజంగ రావు :*

ఏవని రాస్తారమ్మా. మీరంతా ఆధునికులు. మా కాలంలో అయితే మహారాజ రాజశ్రీ ఫలానా వారికి అనేక శత సహస్ర సాష్టాంగ దండ ప్రణామములు, అని రాసేవాళ్ళం. ఆ! రాయమ్మా. ఏం రాస్తావో చెప్మా! మైడియర్ అంటావా? ఎందుకూ-"డియర్ రఘూ! మా మామయ్య, నాన్న ఇవ్వాళ సాయం త్రం వూరికి వెళ్తున్నారు. ఒక చిన్న విశేషం నీతో చెప్పాలి. తప్పకుండా రా." అంతేనమ్మా. ఆఁ! ఆఁ! సంతకం పెట్టబోకు. ఇల్లా ఇచ్చేసేయ్ ఆ కాయి తాన్ని. ఇహ నువ్వెళ్ళమ్మా లోపలకు. పాపం! మళ్ళీ వంటా అదీ చూడాలి. వెళ్ళమ్మా.

(జానకి లోపలకు వెళ్ళిపోతుంది.)

*భుజంగ రావు :*

ఈ కాయితం ఎందుకు రాయించా నంటావ్.

***కనకయ్యా :***

ఏమో. సారథివి, నీకు తెలియాలి ఎక్కడికు తీసుకు పోతున్నదీ.

భుజంగరావు :

చెప్పమంటావా !

కనకయ్య:

వూహూ. వద్దు. వద్దు. చెబితే థ్రిల్ చచ్చి పోతుంది.

భుజంగరావు :

నిజమే. ముందేం జరుగుతుందో తెలిస్తే మనం బ్రతకడమే కష్టమవుతుంది. ప్రతిక్షణం ముందేం జరుగుతుందో అన్న తహ తహ, నాటకంలోలాగా. జీవితంకూడా ఓ పెద్ద నాటకమేగా. ఈ నాటకంలో మనమిప్పుడు రెండో అంకంలో వున్నాం.

కనకయ్య :

మూడో అంకమెప్పుడు ?

భుజంగరావు :

లెక్క ప్రకారం ఇవ్వాళ సాయంకాలానికి ప్రారంభం కావాలి.

కనకయ్య :

ప్రారంభించే వాడివి నువ్వేగా.

భుజంగరావు :

కాదు. మన జీవితాల్లోని మూడో అంకంయొక్క సూత్రధారి నువ్వూ, నేనూ కాదు. శివయ్య.

కనకయ్య :

అట్లాగా ?

భుజంగరావు :

అరరె. చెప్పేసేస్తున్నానే. ఆ! ఇహ ప్రస్తుతానికి ఈవిషయం మర్చిపోదాం. మామ్మాలు మనుషుల మైపోదాం.

(లోపల గదిలో గడియారం ఏడు గంటలు కొడుతుంది)

భుజంగరావు :

అమ్మాయ్ ! జానకీ — కాఫీ తీసుకురా.

కనకయ్య :

అరె. ఇంకా నువు కాఫీ త్రాగలేదూ ! (పెద్దగా) జానకీ ! జానకీ ! ఏం చేస్తున్నావే — మావయ్యకు కాఫీ పట్టుకురా.

జానకి :

(లోపలున్నుంచి) తెస్తున్నా నాన్నా !

కనకయ్య :

వూఁ ! తొందరగా.

(జానకి లోపల్నుంచి కాఫీ గ్లాసులతో వచ్చి చెరొహటీ యిచ్చి మళ్ళీ వెళ్ళిపోతుంది. ఇద్దరూ కాఫీ త్రాగుతూంటారు.)

(మహేంద్రం బయటనుంచి ప్రవేశం)

మహేంద్రం :

దండాలు దొరకు. (భుజంగరావును అప్పుడే చూసి) దండాలు బాబూ!

భుజంగరావు :

మీ దొరకొక్కడికే పెట్టూ చాలు. నాకూ్కడా ఎందుకు.

మహేంద్రం :

మీరూ దొర్లే.

భుజంగరావు :

ఎప్పట్నుంచీ.

మహేంద్రం :

పిట్ట నొగ్గేసినప్పట్నుంచి.

భుజంగరావు :

కానీ పోలీసు వాళ్ళకు కావలసిన పిట్ట మాదగ్గరే వుంది.

మహేంద్రం :

(చల్లారిపోయి) పరాసిక మాడ్తున్నారు దొర.

భుజంగరావు :

పెద్దవాళ్ళ దగ్గర కొంచెం ఒళ్ళు దగ్గరపెట్టుకు మాట్లాడు మహేంద్రం. కనకయ్యా! చెరువులో

చేపల పాటను తన కిప్పించమని ఆ దానియేలు ఒకటే ఏడుస్తున్నాడు. వెళ్ళి ఆ పంచాయతీ ఆఫీసరుతో మాట్లాడొస్తాను.

మహేంద్రం :

దొరా! దొరా! నామీద అంత కోపం దేనికి దొరా. నాకిప్పించమని పోయినడుగాదికే సెప్పితిని కద్దొరా.

భుజంగరావు :

నీలాంటి పొగరుమోతు వాడికి ఉపకారం చేసినా అపకారమే అవుతుందిరా.

మహేంద్రం :

ఏం సెయ్యమంటారో సెప్పండిదొరా! నా సెర్మంతో సెప్పులు కుట్టీనా?

భుజంగరావు :

మనిషి చర్మంతో కుట్టిన చెప్పులు ఇంకా ఎవరూ తొడుక్కోడం లేదురా. ఆ రోజులూ వస్తాయేమోలే. ఇంతకూ ఆ చెరువు కావాలంటావ్ నువ్వు?

మహేంద్రం :

అవున్దొరా.

భుజంగరావు :

అందుకు నాకేమిస్తావ్.

మహేంద్రం :

ఏం కావాలంటే అదిస్తాన్దొరా.

భుజంగరావు :

ఏమీ ఇవ్వద్దు. ఆ విశ్వాసం వుంచుకో చాలు. వస్తాను కనకయ్యా. ఆఫీసుకు వెళ్తున్నాను. కొన్ని డాక్యుమెంట్లు కావాలి. (వెళ్లిపోతాడు)

మహేంద్రం :

భుజంగరావుగార్తో పెద్ద పెమాదం బాబు.

కనకయ్య :

ఏం? ఇప్పుడు తెలిసిందా?

మహేంద్రం :

(నవ్వుతాడు)

కనకయ్య :

(అటు యిటు చూసి) ఒరేయ్! ఆ గడ్డివాములు పూర్తిగా తగలబడినట్లేగా.

మహేంద్రం :

ఇంకా సందేహమా బాబూ. అనుమానంగా వుంటే ఎళ్లి సూసిరండి.

కనకయ్య :

పిచ్చి వెధవా ! అలా మనం వెళ్ళ కూడదురా. ఒరేయ్, సరేగానీ, కోటప్ప విషయం ఏమైందిరా.

మహేంద్రం :

ఏమవుతుంది బాబూ, అడో మూర్ఖుడు.

కనకయ్య :

మూర్ఖుడు!! మూర్ఖుడికి బుద్ధి చెప్పడం మాకు బాగా తెలుసు.

మహేంద్రం :

ఆ పని నా కొదిలేయండి బాబూ. ఎప్పుడో ఆడి రెక్కలు నే నిరిసేత్తాను.

(తొందరగా భుజంగరావు ప్రవేశం)

భుజంగరావు :

బయల్దేరండయ్యా ! వూఁ! తొందరగా. మహేంద్రం లే. కనకయ్య — లేవయ్యా లే. లే!! తొందరగా వూఁ! శివయ్య దగ్గరకు వెళ్ళాలి మన మందరం.

కనకయ్య :

శివయ్య దగ్గరకా ?

భుజంగరావు :

అవును. శివయ్య దగ్గరకే. మూడో అంకం పన్నెండు గంటల ముందుగానే ప్రారంభం కాబోతోంది. లే. లే. పద. పద మహేంద్రం.

మహేంద్రం :

ఆలోసన్దేనికి. పదండ కనకయ్యగోరూ !

(అందరూ బయల్దేరుతుంటగా)

( తెర )

# పద్మవ్యూహం

## తృతీయాంకం

(రంగస్థలమంతా వేష భాషాడంబరంలేని పుణ్యస్త్రీలా కన్పిస్తుంటుంది. రంగస్థలానికి మధ్యగా ఇంటిలోపలికి వెళ్ళడాకిని ఒకద్వారం, ద్వారానికిపైగా శంకర భగవత్పాదుల తైలవర్ణచిత్రం. ఆ వసారా అంతట తుంగచాపలు పరుపబడి వున్నాయి. గుమ్మానికి ఎడమ ప్రక్కగా అలికి ముగ్గులు పెట్టబడిన ఒక ఎత్తైన అరుగు మీద కృష్ణాజినం పరుచుకుని ముందు ముంగాళ్ళ పీటలో ఒక దివ్య గ్రంథాన్నుంచుకుని శివయ్య పారాయణం చేస్తున్నాడు. ధోవతి కట్టుకుని వున్నాడు. యజ్ఞోపవీతం స్ఫుటంగా కన్పిస్తోంది. మొగమున విభూతి రేఖలు, పైన ఉత్తరీయం.)

*శివయ్య :*

నళినీ దళగత జలమతి తరళం
తత్త్వ జ్జీవన మతిశయ చపలం
విద్ధి వ్యాధి వ్యాలగ్రస్తం
లోకం శోక హతంచ సమస్తం.

(రఘుపతి అవనత వదనుడై విచారంగా ప్రవేశిస్తాడు)

రా, నాయనా ! కూచో. కాయా ? పండా ?

రఘుపతి :

'పండు' అని చెప్పుకోగల అదృష్టాన్ని ఇంకా ఆ భగవంతుడియ్యలేదు.

శివయ్య :

అల్లాగా! .... ఇటుచూడు కర్మ చేయడంవరకే మనవంతు. ఫలితం ఆ పరమేశ్వరుడిది. నువు బాధ పడకు.

రఘుపతి :

ఎవ్వరిదగ్గరా ఒక పన గడ్డకూడా లేదన్నారు.... మూర్ఖులు....

శివయ్య :

నాయనా ఒకరిని మూర్ఖులన్నంతమాత్రాన మనకు వరిగేదేమిటిచెప్పు? వాళ్ళమనసుల్లోవున్న అనుమాన మేవిటో!! దీనికంతటికీ అర్థం తెలుసా మన మంచితనంమీద వాళ్ళకు నమ్మకంతగ్గిందన్నమాట.

**(లోపలి గుమ్మంలోనుంచి నారాయణ వస్తాడు. మనిషిలో చెప్పలేని ఏవో ఆవేదన. అలాగే వణకుతూవచ్చి శివయ్య కాళ్ళమీద పడబోయి)**

నారాయణ :

బాబూ! శివయ్యబాబూ! తరింపచేయాలి. నన్ను

మీరు తరింపచేయాలి అనండి, ఆ మాట అనండి. నాకు వాగ్దానమివ్వండి.

**శివయ్య :**

అయ్యయ్యో! నారాయణ ఇదేమిటి?! లే. లే. ముందు కాళ్ళమీదనుంచి లే.

**నారాయణ :**

ఉహూ. లేవను. ముందు మీరు వాగ్దానమిస్తేనే కాని లేవను.

**శివయ్య :**

వాగ్దానమా? ఏమిటి నారాయణా?

**నారాయణ :**

(బాధగా) ముందు నన్నీ బాధలోనుంచి తప్పించండి.

**శివయ్య :**

లే. ముందు లేచి కూచో. నీ కోరిక నెరవేరుతుందిలే. కూచో.

**నారాయణ :**

(లేచి కూచుంటూ) శివయ్య బాబూ! చెప్పలేకుండా వున్నాను. ఏమిటో — ఈ బాధ.

**రఘుపతి :**

ఏమిటది?

నారాయణ :

నిన్నరాత్రి ఏవో, ఏవేవో కలలు. నిద్ర పట్టింది. పట్టనూ లేదు. రాక్షసుల్లాంటి వారెవ్వరో నన్ను నిప్పు ల్లోకి తోసేశారు. నిప్పుల్లోంచి బయటకు వచ్చేసరి కల్లా శరీరమంతా కమిలిపోయింది. ఆ తర్వాత కొంతసేపటికి చల్లబడ్డ ఆ శరీరమే బంగారంలా మెరవడం ప్రారంభించింది. ఆతర్వాత, ఆ తర్వాత....

రఘుపతి :

ఆ తర్వాత....

నారాయణ :

అలా చూస్తూనే ఉన్నాను. ఏవరో ఓ యువకుడు ఇతనిలాగానే వున్నాడు — వచ్చి 'నాన్నా' అంటూ నన్ను కవుగలించుకున్నాడు' 'ఆ !' అనబోయాను. ఏమిటో చెప్పలేని ఓ గగుర్పాటు శరీరంలో! అంతే. నా శరీరం నల్లబడిపోయింది. అంతానాకు తెలుస్తూనే వుంది. ఈ శరీరంలోంచి ఇల్లాంటి ఇంకొక శరీరం బయటకు వచ్చింది.

శివయ్య :

అదృష్టవంతుడివి నారాయణ ! నీ అన్వేషణ చాలా తొందర్లోనే సాఫల్యం కాబోతున్నది.

నారాయణ :

కానీ....

రఘుపతి :

కానీ ?—

నారాయణ :

మెళకువ వచ్చింతర్వాత నేను పడుతున్నబాధ మ
మిక్కుటంగా వున్నది. అడుగుతీసి అడుగు పెడిత
నా శరీరం మండిపోతున్నట్లనిపిస్తున్నది. నేన
చేసిన పాపాలు, పాములై, నీడలై నన్ను
వెంటాడు తున్నట్టనిపిస్తున్నది. ఈ బాధనుంచి
నన్ను తప్పించండి. ఇవి మర్చిపోయే మార్గం
చెప్పండి.

శివయ్య :

అది చెబితే వచ్చేదికాదు నారాయణా! నీలో సంయ
మనం కలగాలి. ఈ జీవితం మీద కోరిక నశిం
చాలి. కన్నీళ్ళనూ, ఆనందాన్నీ సమానంగా స్వీక
రించగల తత్వం నీలో పెంపొందాలి.

నారాయణ :

నాకు జీవితంలో ఏ కోరికాలేదని మీకు చెప్పాను.
అదొక్కటి మినహాయించి నా బాబు నోరారా
'క్షమించాను' అని అనడం మినహాయించి నాకేదీ
అక్కర్లేదు.

**(కోటప్ప బయట్నుంచి వస్తాడు. వచ్చి గుమ్మం దగ్గరే
ఆగిపోయి)**

కోటప్ప :
దండాలు బాబూ !

శివయ్య :
కోటప్పా !! (సంతోషంగా) చాలా పెందలకడనే లేచి నట్లుందివాళ.

కోటప్ప :
కోడికూయగనే కిట్ట కాలువ కెళ్ళినాను బాబు. తల నిండా తానం సేసి మీ మాటలు రెండు చెవి నేసుకపోదామని వచ్చినాను.

శివయ్య :
చాలా సంతోషంగా వుంది కోటప్పా. నా జన్మ కివాళ నిజంగా చరితార్థత లభించినట్లనిపిస్తోంది.

కోటప్ప :
అట్టాగా బాబూ ! నిజంగా మీరు నన్ను సూసి సంతోషపడుతున్నారా ? **(శంకర భగవత్పాదుల పటం వేపు చూస్తూ)** దేవుడూ ! ! **(ఏం చెప్పాలో తోచక)** నిజంగా నువ్వు దేవుడివే ! ! !

రఘుపతి :
**(లేచి కోటప్పకు దగ్గరగావచ్చి)** కోటప్పా నిన్న సాయంకాలం నిన్ను నే ననుమానించాను.

కోటప్ప :

అది మామ్మూలే కదు బాబూ.

రఘుపతి :

నువ్విలా మారతావనుకోలేదు.

కోటప్ప :

నేను మాత్రం అనుకుండానా ? (నమస్కారం పెడుతూ) అంతా ఆ శివయ్‌గారి దయ.

శివయ్యా :

నా దయకాదు కోటుప్పా. ఆ భగవంతుడికి నీమీద దయకలిగింది. నువు చేసుకున్న కర్మ పాపమనే పాము కుబుసం. నిన్నటితో నిన్ను వదిలి పోయింది.

కోటప్ప :

నా పాలిటి భగవంతుడు మీరే బాబూ !

నారాయణ :

(బాధగా) భగవంతుడు ? ఇంకా ఆ శివయ్య తండ్రికి నామీద దయకలగలేదు.

శివయ్యా :

ఎందుకు కలగలేదయ్యా. నీలో ఆ మానసికమైన

పరిపక్వతే వుండాలి కాని, ఈ రఘును నీ కొడుకు అనుకోరాదూ.

(నారాయణ, రఘులలో ఒక విచిత్రమైన గగుర్పాటు అలౌకికమైన స్థితి)

నారాయణ :

ర....ఘు !

రఘుపతి :

నా....న్న ?

నారాయణ :

(పెద్దగా) రఘూ ! ! !

రఘుపతి :

(పెద్దగా) నాన్నా ! ! !

(ఇద్దరి కన్నులలోనూ బాష్పాలు)

నారాయణ :

(గద్గదికంగా) నాకు కొడుకు లేడనుకున్నాను. ఆ లోటు నువు తీరుస్తావు. అవును, ఆలోటును నువు తీరుస్తావు.

రఘుపతి :

(మాట చెప్పలేక) నాకు తండ్రి లేడనుకున్నాను. మళ్ళీ మీ రూపంలో - ఆ లోటు నాకు తీరింది.

(సుబ్బారాయుడు పరుగెత్తుకుని వస్తాడు)

సుబ్బారాయుడు :

శివయ్యగారూ! శివయ్యగారు! మీ దేవుడు చచ్చి పోయినాడు!!

శివయ్య :

శివ శివా! ఏం మాట సుబ్బారాయుడూ?

సుబ్బారాయుడు :

నే నేం తప్పుడు మాట అన్నానూ?

శివయ్య :

భగవద్దూషణ చాలా తప్పు నాయనా.

సుబ్బారాయుడు :

నే నేమన్నానూ! మీ దేవుడు చచ్చిపోయినాడూ, మా మావయ్య దేవుడైనాడూ అన్నాను.

శివయ్య :

మళ్ళీ అదేమాట –

రఘుపతి :

మీ మావయ్య దేవుడు కావడమేమిటి?

సుబ్బారాయుడు :

అవునూ మానాన్న, మంత్రిగారి దగ్గరికివెళ్లి "ఏమండీ ఇప్పుడున్న దేవుడు ముసలి దేవుడై పోయినాడూ, మాబావను దేవుడిగా వెయ్యండీ" అన్నాట్ట. అప్పుడు

ఆ ఉద్యోగాలిచ్చేవాళ్ళేమో మా మావయ్యను దేవుడిగా వేసేశారు.

**కోటప్ప :**

సరిగా సెప్పవయ్యా.

**సుబ్బారాయుడు :**

ఎందుకూ నన్ను దబాయిస్తావూ - అయితే అసలు చెప్పను.

**రఘుపతి:**

సుబ్బారాయుడూ నువ్వు చాలా మంచివాడివికదూ!

**శివయ్య :**

చెప్పు నాయనా!

**సుబ్బారాయుడు :**

(రఘుతోటి) నువ్వడిగినావని చెప్పటంలేదు. ఆయనడిగాడని చెబుతున్నాను. దేవుడంటే ఎవరనుకున్నారూ (నవ్వుతూ) ట్రస్టీ అంటే ధర్మకర్త. అంటే ధనమును ధర్మముగా విశ్వామిత్రం చేసేవాడూ అని అర్థం.

**రఘుపతి :**

మీ మావయ్యను ట్రస్టీగా వేశారా ?

**సుబ్బారాయుడు :**

(దీర్ఘంతీస్తూ) వూఁ! మరేమిటనుకున్నావ్ ? ఇక్కడి

నుంచి బలేబలే మార్పులు చేస్తాట్ట. పులిహోర, చక్ర పొంగళీ పెడుతుంటే ఆలయానికి ఎవరూ రావడం లేదని ఇహనుంచీ పొద్దుటి పూటేమో ఇడ్లెన్లూ - సాంబారుతో కూడానూ. సాయంకాల మేమో వూతప్పమూ యిస్తాట్ట. కోటప్పా ! వూతప్పం బలేగా వుంటుందికదూ. మామూలుగా హరికథ పెడితే వున్నవాళ్ళుకూడా లేచిపోతున్నా రనీ, ఆదివారం పొద్దుటిపూటేమో—పెద్దవాళ్ళకోసం ప్రత్యేకం తీసే ఇంగ్లీషు సినీమాలు వేయిస్తాట్ట - టిక్కట్టు పెట్టేలెండి—రఘుపతీ ! నిన్నూ ఆ ముసలా యన్నూ టిక్కట్టు లేకుండానే రమ్మనమని మా నాన్నతో చెప్తాన్లే. అవును మరీ—మా నాన్న లేకపోతే మా మావయ్యే ఏముందీ — .... కారం లేని మిరపకాయ్ ! !

శివయ్య :

తప్పు సుబ్బారాయుడూ ! పెద్దవాళ్ళనలా అన కూడదు.

సుబ్బారాయుడు :

అంతా విచిత్రంగా వుంది. జిలేబి తినకపోతేనేమో మా నాన్న కోప్పడతాడు. జానకిని పెళ్ళిచేసు కోక పోతేనేమో మా మావయ్య కోప్పడ

తాడు. నిజం చెప్పకపోతేనేమో దేవుడు కోప్పడ తాడు. మర్చిపోయాను. దేవుడిప్పుడు మా మావ య్యేగా! అయితే ఇహ నిజం చెప్పనక్కర్లేదు. అయినా పెద్దవాళ్ళనంటున్నానని మీరు కోప్పడ తారు. ఎట్లా చావడం ఇందరి కోపాల మధ్య.

*శివయ్య :*

జానకిని నీ కియ్యాలనుకుంటున్నారా?

*కోటప్ప :*

తెల్సింది బాబూ. ఇప్పుడు తెల్సింది.

**నారాయణ :**

ఏమిటీ?

*కోటప్ప :*

నిన్న సాయంకాలమా జానికమ్మ తల్లి గుడికాడి కొచ్చింది దేవుణ్ణి సూట్టానికి. (నవ్వుతూ) పిచ్చి మొగమోణ్ణి! ఎవరు తల్లీ నీ దేవుడని అడిగాను. ఇంతలోకి ఆ మయేంద్రం, కనకయ్యగోరు వచ్చి, నాలుగు తిట్టి ఆ యమ్మను ఇంటికి తోలుకెళ్ళినారు. ఇప్పుడర్దమవుతున్నది. బుల్లెమ్మగా రడిగిన పెశ్నకు సమాధానం.

*నారాయణ :*

ఏమిటది?

కోటప్ప :

జానికమ్మగోరికి—మన సిన్న దొర—దేవుడు బాబూ.

సుబ్బారాయుడు :

అదేమిటి ?....జానకికి నేనంటే ఎంతో యిష్టం.

శివయ్య :

చెప్పలేం సుబ్బారాయుడూ, ఎవరికి — ఎలా— ఎప్పుడు —రాసిపెట్టి వుంటుందో ఎవ్వరం చెప్పలేం.

నారాయణ :

శివయ్య బాబూ ! మీరు మనసునిండా తల్చుకుంటే కానిదేమీ వుండదు. దయచేసి, మన బాబుకు ఆ జానకి నిప్పించలేరూ ?

శివయ్య :

(తేలిగ్గా) మనం వరుడివేపు వాళ్ళం నారాయణా ! కొంచెం బెట్టుగా వుండాలి. వరాన్వేషణ చేసుకుంటూ వాళ్ళే వస్తారు మన దగ్గరకి. మన కాభయం అక్కర్లేదు.

నారాయణ :

భయం కాదు శివయ్యబాబూ! ప్రేమలేని పెళ్లి ఎంతటి బాధాకరమైనదో నేను తెలుసుకున్నాను. నా బాబునైనా సుఖపడనీయండి.

శివయ్య :

విచారపడకు నారాయణా! రఘుపతి తప్పకుండా సుఖపడతాడు. నీ జీవితంలో నువ్వు చేసిన పొరపాట్లు రఘుపతి జీవితంలో మళ్ళీ పునరావృతం కావు. అంతమాత్రం నే చెప్పగలను.

సుబ్బారాయుడు :

ఏమోయ్ !

రఘుపతి :

ఏవిటి రాయుడూ ?

సుబ్బారాయుడు :

ప్రతిరోజూ ప్రొద్దుటి పూటేమో దేవుణ్ణి నిద్దర్లేపాలిట కదూ. అందుకనీ దేవుడి ప్రక్కనే ఓ రేడియో పెట్టించేస్తాట్ట మా మావయ్య. నేనేమో 'రేడియో వద్దూ.... గ్రామఫోను పెట్టూ' అంటున్నాను. నువ్వేమంటావ్ ?

రఘుపతి :

నీతోబాటు మీ మామయ్యను కూడా విశాఖపట్నం పంపిస్తే బావుంటుందంటాను. శివయ్య బాబాయ్ ! ఇప్పటికే మనం చాలా ఆలస్యం చేశాం.

సుబ్బారాయుడు

పోనీ ఇప్పుడైనా పంపించండి ?

రఘుపతి :

బాబాయ్! నోరులేని ఆ పశువులు మలమలమాడేట్లు చేశారు. మీకూ నాకూ ఈ వూళ్ళో ఒక్క సెంటు భూమిలేదు. దేవాలయంలో పూజారిత్వం మీద మీరు, వూళ్లో దస్తావేజులమీద నేనూ బ్రతుకుతున్నాం. సుబ్బారాయుడు చెప్పిందే నిజమై,ఆయనే గనక ట్రస్టీ అయితే, ఇహ మీరూ, నేనూ ఈవూరు వదిలిపెట్టి పోవలసిందే.

కోటప్ప :

కూలేసుకుని మిమ్ము పోసిత్తాను దొరా. మీకా బయం అక్కర్నేదు.

నారాయణ :

అంత అవసరంలేదు కోటప్పా! నేను సంపాయించిన ఆస్తి అదిగో, ఆ మూల ఇంకా పెరుగుతూనే వుంది. పైగా, నా తండ్రిని వెతకడంకోసం బయల్దేరిన ఈ ముసలి వరుగును చూసి జాలిపడి, తలో అణా బేడా విసిరేసే వారు—నా ఏడుపులో నేనుంటే. ఆ డబ్బే వుంది నా దగ్గర, — ఒక్క సంవత్సరంపాటు మనమంతా కూచుని తిన్నా సరిపోయేటంతగా. బ్రతకలేమన్న భయం మీ కక్కర్లేదు.

**రఘుపతి :**

అయితే ముందు ఆ డబ్బుపెట్టి పశువులకు మేత కొనండి.

**నారాయణ :**

మరి మీ తిండి సంగతి ?

**శివయ్య :**

తొందర కూడదు రఘుపతి. గడ్డిని కొనుక్కోవచ్చు. మరలా అది అగ్నిదత్తం కాదని నమ్మకమేమిటి ? మనుష్యుల్లో మార్పురావాలి. ఆ మార్పు వచ్చిననాడు డబ్బుతో అవసరమే లేదు.

**రఘుపతి :**

మార్పు ? .... చేరి మూర్ఖుల మనసు రంజింపలేము.

**శివయ్య :**

ఈ మూర్ఖత్వమూ అనేది ఎవరి సంస్కారం ప్రకారం వారికి కన్పిస్తుంటుంది. కనకయ్య, భుజంగరావులకు నువ్వూ నేనూ మూర్ఖులం. మహేంద్రానికి కోటప్ప మూర్ఖుడు. సుబ్బారాయుడుకి ప్రపంచ మంతా మూర్ఖులే.

**సుబ్బారాయుడు :**

బలే ! బలే ! నాకేమో మా నాన్న పిచ్చివాడు. మా మావయ్య కేమో నేను పిచ్చివాణ్ణి. మా నాన్న

కేమో మా మావయ్య పిచ్చివాడు. బలేవుంది కదూ ? - ఈ లోకమంతా పిచ్చివాళ్ళే.

రఘుపతి :

కానీ ఈ పిచ్చివాళ్ల మూలంగానే, మేము నిజంగా పిచ్చివాళ్లమై పోవలసి వస్తున్నది.

కోటప్ప :

ఈ గండక త్తెర నుంచి బయటపడ్డానికో మార్గం వుంది దొరా.

రఘుపతి :

ఏమిటది ?

కోటప్ప :

ఎట్టాగయినా ఆ కనకయ్య ఈదేవాలయానికి ట్రస్టీగా వుండకూడదు.

నారాయణ :

నే చెప్పేది వినుబాబూ. ఈ పుల్లతో మనం అవతల వాడి కన్ను పొడిస్తే, అవతలి వాడు మరో పుల్లతో మనకన్ను పొడుస్తాడు.

శివయ్య :

బాగా చెప్పావు నారాయణా ! పౌరుషం ద్వేషానికి దారితీస్తుంది. ద్వేషం నాశనానికి దారి తీస్తుంది. ఆలోచించు.

రఘుపతి :

క్షమించు బాబాయ్! నేను మరోవిధంగా ఆలోచించలేదు. నోరులేని పశువులే వాళ్ళకు పరమ శత్రువులైనప్పుడు, — మనం — చీమూ నెత్తురులతో వున్నవాళ్ళం, మనను వాళ్ళు విడిచిపెడతారా? మంచికి బోయి, మన బాగును మనమే విస్మరిస్తే....

శివయ్య :

ఆలోచించు. మరోమార్గం ఆలోచించు.

రఘుపతి :

ఇంకా ఏం ఆలోచించను? — ఆలోచించి, ఆలోచించి, పిచ్చివాణ్ణి కావడం తప్ప మరేమీ లేదు.

సుబ్బారాయుడు :

అయితే మరీ మంచిది. మనిద్దరం కలిసే ఆలోచించవచ్చు. ఆడుకోవచ్చు.

రఘుపతి :

**(లేచి నుంచుంటూ)** నన్నాశీర్వదించండి బాబాయ్! ఇంకా వూళ్ళో పరపతి పూర్తిగా పోలేదుగా. నలుగురిచేతా సంతకాలు పెట్టిస్తాను. కనకయ్యగారు కాకుండా ఇంకా ఎవ్వరయినా సరే, మనకు యిష్టమేనంటాను.

సుబ్బారాయుడు :

(ఆపుతూ) మాట .... నువ్వు ఇడ్లీ సాంబారు పెట్టి స్తావా ?

నారాయణ :

(లేచి నుంచుంటూ) నేనూ వస్తున్నాను పదబాబూ.

రఘుపతి :

మీరా ?

నారాయణ :

ఏ వేళ ఎటువంటిదో ఎవరు చెప్పగలరు ? నన్నూ నీ వెంట వుండనీ.

(వాళ్ళిద్దరూ ముందుకు రెండడుగులు వేస్తారు. గురవయ్యసెట్టి రావడంతో ఆగిపోతారు. గురవయ్యసెట్టి నల్లని, గుండ్రని, పొట్టి మనిషి. చెవులకు ఎర్రరాళ్ళ పోగులు. మొగమున పొడుగాటి నామాలు. ఎర్రటి గావంచా మోగాళ్ళపై కే కట్టు కున్నాడు: మూడు నాలుగు జేబులున్న ఓ ముతకబనీను.)

గురవయ్యసెట్టి :

నమస్కారం పూజారిగోరూ. బొత్తిగా మీరు కంట బడ్డమే మానేశారు.

రఘుపతి :

(కోపంగా) మేం కంటపడడమేమిటి ?

గురవయ్యసెట్టి :

అహ. ఏం లేదు రఘుపతి బాబూ. మీరీ మద్దెన

నాక్కనుపించింది పోయిన పౌర్ణమికే కదా అంట. అందుకనీ, గల్లాపెట్టిదగ్గర మా బుడ్డోణ్ణి కూచోబెట్టి ఇట్టావచ్చాను.

*శివయ్య :*

కూచో గురవయ్యా.

*రఘుపతి :*

అవునుమరి. ఎంతపని లేనిదే ప్రొద్దున్నే గల్లాపెట్టి వదిలి ఇల్లా వస్తావా ?

*గురవయ్యసెట్టి :*

ఆ ! దాన్దేముంది — ఇప్పటిక్కాకపోతే ఇంకాస్సే పటికి. తగలబడిపోయింది మళ్ళా వస్తుందా అంట ? .... ఎంతకుప్ప .... ఎంత కుప్ప ! ! మా ఇల్లంత ఎత్తున వుంది ! !

*రఘుపతి :*

ఓహో ! అందుకనే గామోను సంవత్సరం మొదట్లో "గడ్డి బాగా పురెక్కింది. కొనుక్కోవయ్యా" అంటే "ఆ! ఆ! నాకేందుకూ" అంటూమొగం తప్పించావ్.

*గురవయ్యసెట్టి :*

ఏందదీ—నామీద నెపం సెపుతాడూ ? నేను కొనుక్కోనూ అన్నానంట. పశువులకు మేత తక్కువవుతుందని వూరుకున్నా గానీ....

**శివయ్య :**

అవును. ఆరోజు నువు మమ్మల్ని ఉపేక్షించావు. ఈరోజున భగవంతుడు మమ్మల్ని ఉపేక్షించాడు.

**కోటప్ప :**

పోనీ —గురవయ్‌గోరూ, నేనోమాట సెపుతానూ, మీరెందుకట్టా సెయ్‌కూడదూ అంట—

**గురవయ్యసెట్టి :**

ఏందయ్యోయ్ — చాపకిందకి నీళ్ళు తెచ్చేవ్. నీకేం?—మారాజులాగా ఆ పంచన బతుకుతున్నావ్.

**కోటప్ప :**

ఆ! ఏం లేదు, ఓ కుప్ప గడ్డి మాకు బదులిస్తే ఎట్టా వుంటుందా అని.

**గురవయ్యసెట్టి :**

బలేవోడివి. సల్లనిమాట సెప్పావు నా తండ్రి ?— అంగట్లో అరువిస్తున్నాను — ఇంకా పొలంలో పండింది కూడా పెట్టమంటావేటి !

**రఘుపతి :**

ఏమిటయ్యా అరువిచ్చిందీ ? మొన్న నాలుగుమాని కల కందిపప్పు కోసం పంపిస్తే లేవని త్రిప్పి పంపించావు....

గురవయ్యాసెట్టి :

ఏవయ్యోయ్. అబద్ధ మాడమాక, లేవన్నానా ?— కందిపప్పు లేవన్నాను కాని — మినప్పప్పు పట్టు కెల్లమన్నా ?

నారాయణ :

కందిపప్పుకూ, మినప్పప్పుకూ సాపత్యం ఏమిటయ్యా ?

గురవయ్యాసెట్టి :

నీకూ నాకూ సాపత్యం ఏమిటయ్యా — పెద్ద చెప్పొచ్చినావ్. కందిపప్పు కాకపోతే మినప్పప్పు పట్టుకెల్లగూడదూ ?

రఘుపతి :

అదొక్కటేనా ? మిరపకాయల కోసం పంపిస్తే చింతపండు కట్టిపంపిస్తావూ....జీలకర్ర కావాలంటే మెంతులా .... డబ్బు మాత్రం ముద్ర శుద్ధిగా కావాలే....

సుబ్బారాయుడు :

డబ్బు లేకపోతే ఎట్లా ? ఆ డబ్బే లేకపోతే మా మావయ్యా దగ్గరకు మా నాన్న వచ్చేవాడే కాదు.

గురవయ్యాసెట్టి :

పిచ్చోడివైనా బలే చెప్పినావు. డబ్బు లేనివాడు డుబ్బుకు కొరగాడు.

రఘుపతి :

డ .... బ్బు .... అవును. ఆ డబ్బును కరిగించి నీ నోట్లో పోసేస్తేగాని.... లేకపోతే నీ ప్రాణం చూరును పట్టుకుని వ్రేలాడుతూనే వుంటుంది.

శివయ్యా :

రఘూ ! ఏవిటా మాటలు ?....కోపమునకు ఘనత కొంచెమై పోవును. తెలీదూ. శాంతమూ లేకా సౌఖ్యమూ లేదు.

రఘుపతి :

క్షమించు బాబాయ్. ఆవేశంలో మూర్ఖుణ్ణయ్యాను. (గద్గదికంగా) మన శాంతమూ, మన నిదానమూ, ఇతరులు బలహీనంగా తీసుకుంటున్నారని, మన మంచితనాన్ని వాళ్ళ డబ్బుతో కొలిచి....

గురవయ్యాసెట్టి :

ఏమిటయ్యా - డబ్బు .... డబ్బు .... డబ్బు అంటున్నావ్ మహా. ఏదీ నామొహాన పారేసేయ్ నా డబ్బును. మంచితనమంట ? పన్నెన్నేళ్లు ఆగినోణ్ని నేను మంచివాణ్ణికాదు ? ....

శివయ్య :

కాదని ఎవరనగలరు ? ఇంత కాలం ఓర్పు వహించావు. ఇంకొక్క రెండు నెలలు ఓపికపట్టు.

గురవయ్యసెట్టి :

ఎందుకు పట్టాలీ ? - మీ మడి మాన్యాలు చూశా ? మీ మర్యాద చూశా ? -

కోటప్ప :

(వళ్ళు మర్చిపోయి) గురవయ్య....

గురవయ్యసెట్టి :

ఏం కొట్టావా ? కొట్టు. శివయ్య డబ్బివ్వలేక కొట్టించాడని కూడా చెప్తా అందరితోటీ.

కోటప్ప :

ఉరితీత్తాను....ఇట్టాగే మాట్టాడ్తివా !

గురవయ్యసెట్టి :

నన్ను కొట్టడం కాదు. మా మావయ్యను కొట్టాలి. అప్పుడు తెలుస్తుంది నీపని.

**(ఈ సంభాషణ జరుగుతుండగా నారాయణ లోపలకు వెళ్ళి ఓచిన్న అల్లిక సంచీతో బయటకు వస్తాడు. ఆ సంచీని విసురుగ్గా గురవయ్యమీద పడేస్తూ)**

నారాయణ :

తీసుకోవయ్యా ! వెధవ డబ్బు !! మర్యాదను గుర్తించలేక పోయావు.

గురవయ్యసెట్టి :

(సంభ్రమంతో) డబ్బే !! (సంచీ తెరచి చూస్తూ) అవును డబ్బే ! డబ్బు !!!

శివయ్య :

(ప్రశ్నార్థకంగా) నారాయణా ?

నారాయణ :

శివయ్యబాబూ—ఈ డబ్బు నేను సంపాయించింది కాదు. నాలోని బిచ్చగాణ్ని చూసి ప్రజలు జాలిపడి ఇచ్చింది. ఆ ప్రజల జాలి ఈ విధంగా ఒక మంచి కార్యం కోసం వినియోగించబడితే — అంతకన్నా కావలసింది లేదు.

శివయ్య :

పరమేశ్వరా! నన్ను అవమానంనుండి రక్షించడానికి ఇదా మార్గంనీకు !

రఘుపతి :

(గురవయ్యతో, కోపంగా) ఇంకా ఎందుకూ నిలబడ్డావ్ వెళ్లు.

*గురవయ్యసెట్టి :*

(బెట్టుగా) నాకొద్దీ డబ్బు.

*శివయ్య :*

తీసుకో గురవయ్యా — ఎప్పటికెలా ఋణవిముక్తి అయే మార్గంవుంటే అలా అవుతుంటుంది.

**(ఇంతలో బయటినుంచి భుజంగరావు, కనకయ్య, మహేంద్రం వస్తారు. మహేంద్రం వచ్చి కోటప్ప పక్కనే నిలబడతాడు.)**

*భుజంగరావు :*

నమస్కారం శివయ్యగారూ.

*రఘుపతి :*

ఓ ! మీరా ? !

*శివయ్య :*

భగవదార్పణమస్తు. రండి, కూచోండి.

**(అందరూ కూచుంటారు. అందరూ మవునంగానే వుంటారు. సంభాషణను ఎవరు పొడిగించాలీ అన్న ప్రశ్న. చివరకు శివయ్యే ప్రారంభిస్తూ)**

*శివయ్య :*

అంతా కులాసాయేనా ?

*భుజంగరావు :*

అందరూ ఎవరున్నారు ? కనకయ్యా, నేనూ,

మహేంద్రమేగా ? — (నవ్వుతూ) ఇప్పటి వరకూ పిడిరాళ్ళలాగానే వున్నాం.

సుబ్బారాయుడు :

నాన్నా — నేనూ ?

భుజంగరావు :

ఓరి ! నువ్వా ఇక్కడే వున్నావట్రా ? అవును. ఏడూ—మా మేనగోడలు జానకీ వీళ్ళిద్దరి విషయమే అంతుపట్టకుండా వుంది.

శివయ్య :

అదేమిటి ?

భుజంగరావు :

(మాట తప్పిస్తూ) ఏవిటో ! అనుకుంటుంటాం, అంతా మన చేతుల్లో వుందని. పైన చక్రం త్రిప్పేవాడు. ఏం రఘూ — ఈ మధ్య నల్ల పూసవై పోయావ్ ? పార్టీలకు పార్టీలే, మనుషులకు మనుషులే, మా యింటికి వస్తూపోతూ వుండకూడదూ.

రఘుపతి :

ఎందుకు రాకూడదూ? — తప్పకుండా రావచ్చు. సుబ్బారాయుడి కోసమైనా రావచ్చు.

సుబ్బారాయుడు :

నే చెప్పలేదూ ?

భుజంగరావు :

ఓరేయ్ రాయుడటు. ఏవండీ శివయ్యగారూ, మావా డేం గొడవ చేయడంలేదు గదా మీ దగ్గర.

శివయ్య :

(నవ్వుతూ) గొడవా? గొడవచేస్తే బాగానే వుండేది.

కనకయ్య :

(ఏదో మాట్లాడాలన్నట్లుగా) నే చాలా బాధపడుతున్నా నండి.

రఘుపతి :

ఎందుకూ ?

కనకయ్య :

నిక్షేపంలాంటి గడ్డి వాములు. (కసిగా) రాక్షసులు !!

రఘుపతి :

అవును. రాక్షసులు. మా యింటికూ్కడా నిప్పంటిం చడం మర్చిపోయినారు.

భుజంగరావు :

మేం వూరుకుంటామా? ఊళ్ళో వాళ్ళం మను షులమా, మరేమన్నా నా? అంతా ఒక కుటుంబంలా వుండాలి.

శివయ్య :

నిజమే. ఒక కుటుంబంగానే వుండాలి.

రఘుపతి :

(కోపంగా) కుటుంబం ? అవును. వుండాలి. జంతువుల్లో పులులూ, సింహాలూ, లేళ్లూ, నక్కలూ, కుందేళ్లూ అన్నీ ఒకే కుటుంబం. వాటిల్లో వుండేది జంతు ధర్మమే. ఆకలి వేసినప్పుడే, అవసరం వున్నప్పుడే, అవి మరొక మృగాన్ని చంపుతాయి. కాని మనం ? — అవసరం లేకపోయినా చంపుకుంటాం.

భుజంగరావు :

వివరణ చాలా బావుంది రఘుపతీ ! అలా చంపేవారెవరో, చంపబడేవారెవరో కొంచెం చెప్పగలవా ?

కోటప్ప :

అది ఆ బగమంతుడే సెప్పాల.

మహేంద్రం :

బగమంతుడు ?

శివయ్య :

(ప్రశాంతంగా) కనకయ్యగారూ. ఇంతవరకూ మిమ్మల్ని నేనేమీ అర్థించలేదు. ఈరోజున నా జీవితంలో మొట్టమొదటి సారిగా నోరు తెరిచి మిమ్మల్నొకటి అడుగుతున్నాను. కాదనక ఒప్పుకుంటారా ?

కనకయ్య :

(భయంతో మవునం)

భుజంగరావు :

(జాగ్రత్తగా) ఏమిటది ?

శివయ్య :

ఇంకొక్క రెండురోజులు వుంటే నోరులేని ఆ పశువులు మలమల మాడిపోతాయి. అవి చేసిన పాపం ఏమున్నది ? దయచేసి వాటిని తోలుకుపొండి.

రఘుపతి :

(కలలోలాగ) మచ్చలావు రోజుకు శేరు పాలిస్తున్నది.

కోటప్ప :

ఆ గేదెపడ్డలెండూ ఈనమోసినాయి.

రఘుపతి :

కాడికి కట్టకపోతే ఆ ఒంగోలెద్దు అంకిసానికే రాదు.

గురవయ్యసెట్టి :

పోనీ అమ్మేసెయ్‌రాదూ ?

రఘుపతి :

(కోపంగా) అమ్మడవటు ?

శివయ్య :

రఘూ ! లోపలకు వెళ్ళి మూడు గ్లాసులతో పాలు తీసుకురా. (రఘు అయిష్టంగానే లోపలకు వెళతాడు. అతను

వెళ్ళడం చూచి) ఇంటిముందరి పాడిపశువు శ్రీ మహా లక్ష్మి. ఈనాటి అన్నింటితోబాటు ఈ భావనా మన దేశంలో నాశనమై పోయింది. (గద్గదికంగా) భుజంగయ్యా! ఇవి చేతులు కావు. మంచి రోజులు వచ్చేవరకూ వీటిని మీమందలోనే కలుపుకో. మంచి రోజులు మాకు....(గద్గదికంగా) అన్నింటికీ ఆ అమృత కంఠుడే వున్నాడు.

*కనకయ్య :*

శివయ్యా! నీకెందుకింత కష్టం. వాటికి కావలసిన సంవత్సర గ్రాసం నేనిస్తాను పుచ్చుకో.

*శివయ్య :*

వద్దు. వాటిని పోషించగల తాహతు ప్రస్తుతానికి మాకు లేదు.

**(లోపల్నుంచి రఘు గ్లాసులతో పాలు తీసుకుని వస్తాడు.)**

***భుజంగరావు :***

ఎందుకు శివయ్యా .... ఈ మర్యాదలు ? మేం నీవాళ్ళం కాదా ?

*గురవయ్యసెట్టి :*

పోనీలెద్దూ. ఆప్యాయంగా ఇచ్చినప్పుడు వద్దన కూడదు. తాగవయ్యా తాగు.

**(అందరూ పాలను పుచ్చుకుంటారు)**

సుబ్బారాయుడు :
నాకేవీ పాలు ?

శివయ్య :
తాగుదువు కాని, నాయనా, కొంచెం సేపు వుండి.

సుబ్బారాయుడు :
ఉహూఁ నా కిప్పుడే కావాలి.

భుజంగరావు :
తప్పు నాయనా. ఇంకొకచోటుకు వచ్చినప్పుడు అలా గొడవ చేయకూడదు. డబ్బులిస్తాగా, గొడవ చేయకమ్మా.

సుబ్బారాయుడు :
డబ్బులు కాదు. జిలేబీలు కావాలి.

భుజంగరావు :
మరి ఇంటికి వెళ్ళేసి.

కనకయ్య :
సరే. శివయ్యగారూ, మీరడిగినదానికి ఒప్పుకుంటున్నాను.

సుబ్బారాయుడు :
నాన్నా ! నాకు జిలేబీలు కావాలి. ఇప్పుడే.

భుజంగరావు :

వెళ్దాం పద బావా! వీడిహ బ్రతకనిచ్చేట్టు లేడు. వచ్చిన పనీ అయిందిగా. పోదాం పద.

**(లేస్తూ తన జేబులోనుండి జానకి రఘుపతికి రాసిన ఆ ఉత్తరాన్ని రఘుపతికి దగ్గరగా వదిలేస్తాడు. అది రఘుపతి గమనించడు. సుబ్బారాయుడు చూసి మెల్లిగా భుజంగరావు చూడకుండా దానిమీద తన కాలువేసి అదిమిపెట్తాడు.)**

కనకయ్యా :

సరే పదబావా! మహేంద్రం. వెళ్ళి ఆ పశువుల్ని తోలుకువచ్చి మనకొష్టంలో కట్టెయ్.మరి వెళ్లొస్తాం.

**(భుజంగరావు, కనకయ్య ద్వారందాకా వెళ్తారు. కనకయ్య సుబ్బారాయుడు తనతోపాటు రాకపోవడం చూచి)**

భుజంగరావు :

రావేరా అంత గొడవచేసి.

సుబ్బారాయుడు :

ఉహూఁ. నాకు జిలేబీలు అక్కర్లేదు.

భుజంగరావు :

పోనీ, నీయిష్టం వచ్చిందే తిందువుగానిరారా.

సుబ్బారాయుడు :

నాకేమీా అక్కర్లా.

భుజంగరావు :

పోనీ, ఇక్కడెందుకు, ఇంటికి పోదాం రారా.

సుబ్బారాయుడు :

ఉహూఁ. నేరాను. ఇంటికొస్తేనే, నువ్వు జిలేబి పెట్టావు.

కనకయ్య :

పద భుజంగం, వాడితో ఏవిటీ ?

భుజంగరావు :

(అయిష్టంగా) సరే. (వెళ్తూ) జాగ్రత్త శివయ్యగారూ. అసలే అర్భకుడు వాడు. కాస్తతొందరగా పంపించండి. పద మహేంద్రం. (వెళ్ళబోతారు)

గురవయ్యసెట్టి :

నేనూ వొత్తున్నా వుండండి బాబూ.

(కొంచెం నిశ్శబ్దం, వాళ్ళు వెళ్ళడంచూసి కోపంగా)

రఘుపతి :

ఏవిటి శివయ్య బాబాయ్ ఇది ?

శివయ్య :

ఏది ?

రఘుపతి :

మన పశువుల్నిలా వాళ్ళకు తోలిపెట్టడం—

శివయ్య :

రఘూ! నీకు కావలసింది మన పశువులు క్షేమంగా వుండడమేనా ?

రఘుపతి :

కానీ వాళ్ళలా వుంచరు.

శివయ్య :

పిచ్చివాడా! వాళ్ళలో ఎన్ని లోపాలైనా వుండవచ్చు. కానీ వాళ్ళూ రైతులే. ఆసంగతిమర్చిపోకు. **(రఘు జవాబు చెప్పడు. కొంచెంసేపు ఆలోచన. చివరికి ఏదో నిర్ణయానికి వచ్చినట్లుగా లేచి నుంచుని)**

రఘుపతి :

వెళ్ళొస్తాను బాబాయ్. ఆశీర్వదించు.

శివయ్య :

నీ నిర్ణయం ఇహ మారదు ?

రఘుపతి :

ఆశీర్వదించండి.

శివయ్య :

సరే క్షేమంగా వెళ్ళి లాభంగా రా. ఆపశుపతే నిన్ను కనిపెట్టి చూస్తుంటాడు. ప్రొద్దుగూకినా సరే, పట్నంలో వుండబోకు. నేను నీకోసం శివాలయం దగ్గర ఎదురు చూస్తుంటాను. వెళ్ళిరా.

రఘుపతి :

అలాగే. (ముందుకు అడుగు వేస్తాడు)

నారాయణ :

ఉండు నాయనా నేనూ వస్తున్నానుండు. నన్నూ రానీ.

శివయ్యా :

తీసుకువెళ్లు రఘుపతీ !

రఘుపతి :

మీరెందుకూ ?

నారాయణ :

ఎందుకో చెప్పలేను. కానీ నేను మాత్రం నిన్ను విడిచి వుండలేను. నన్నూరానీ.

శివయ్యా :

తీసుకువెళ్లు రఘుపతీ.

కోటప్ప :

నేనూ ఎల్తాను సిన్నదొరెంట.

రఘుపతి :

కాదు. నువ్విక్కడే బాబాయిని కనిపెట్టుకునివుండు. జాగర్త సుమా. (రఘుపతి, నారాయణ వెళ్ళిపోతారు)

శివయ్య :

నాయనా! సుబ్బారాయిడూ!! నువ్వు ఇంటికి వెళ్ళు. నాకూ జపం చేసుకునే వేళయింది. **(ఇంటి లోపలకు వెళ్ళిపోతాడు.)**

సుబ్బారాయుడు :

**(చీటీ చదువుకుని)** జానకిరాసిందా ?....రఘుపతికి ?.... ఈ విచిత్రమేవిటి ?

కోటప్ప :

ఆ సీటీ ఏంటి సుబ్బారాయుడూ.

సుబ్బారాయుడు :

ఇదా ?....ఇదీ పద్మవ్యూహం!!! **(బయటకు వెళ్ళిపోతాడు. కోటప్ప అతనికేసే తెల్లబోయి చూస్తుండగా)**

(తెర)

# పద్మవ్యూహం

## చతుర్థాంకం

(రంగస్థలమంతా రెండవ అంకంలో ఉన్నట్టే వుంటుంది. అయితే ఒకటే ఒక మార్పు. చదరంగం బల్లమాత్రం తీసివేయ బడింది. మిగిలినదంతా మామూలే. ఇప్పుడు లాంతరు గప్పుగప్పు మని మండడం లేదు. కాంతికోసమని ప్రేక్షకులకు కనిపించ కుండా — వో చిన్న నీలం బల్బు వాడుకుంటే వాడుకోవచ్చు.)

*భుజంగరావు :*

(కుడివైపునుంచి వస్తూ) కనకం! ఒరేయ్ కనకం!

*కనకయ్య :*

(లోపలనుంచే వస్తూ) ఆ! ఆ! వస్తున్నా. వస్తున్నా భుజంగమ్ బావా!

*భుజంగరావు :*

బావా, మట్టిగడ్డలూనూ. అమ్మాయి అలంకరణం చేసికోడం పూర్తయినట్లేనా?

*కనకయ్య :*

అయిపోయినట్టే. ఇంకొంచెం, జడల్లుకుని, పూలెట్టు
కుని ?....

*భుజంగరావు :*

సరిసరి. చీర సింగారించేలోగా వూరు మాటు మణి
గేలా వుంది.

*కనకయ్య:*

అయిపోయింది బావా ! — తొందరపడితే ఎలా
చెప్పు. దానికి నచ్చచెప్పి వప్పించేసరికే తలప్రాణం
తోకకు వచ్చింది.

*భుజంగరావు :*

తీరుబడిగా కూచుని తొందరంటూ మాట్టాడతా
వేమిటి ? — అవతల ఆ కుర్రవాడు ఆఘమేఘాల
మీాద ఎగిరి వచ్చేస్తుంటాడు.

*కనకయ్య :*

బావా ! ఈ అయిడియావల్ల ఏమిటుంటా లాభం ?

*భుజంగరావు :*

చెప్పమంటావా ?

కనకయ్య :

ఎంత తన్నుకున్నా నాకేం అర్థంకావడం లేదు భుజంగం.

(వీధిలో పాదాల చప్పుళ్ళు)

భుజంగరావు :

అయ్యయ్యో ! వచ్చేశాడులావుందయ్యా ! ! ఇప్పుడేం చేయడం ? ఇంకా అమ్మాయి లోపల్నుంచి రానే లేదూ ? ....

కనకయ్య :

ఎన్నడూలేనిది ఎందుకో కంగారు పడిపోతున్నావు బావా, నువ్వివాళ. ఎవరో చెరువునుంచి నీళ్లుతెచ్చు కునే కుర్రవాడు—

భుజంగరావు :

అవును కనకం. ఈ ప్లాన్ గనుక నెరవేరిందో హత్యలూ అక్కర్లేదు. దారిదోపిళ్లూ అక్కర్లేదు. మామూల్గాలుగా అందరూ బ్రతుకుతున్నట్లే, నువ్వూ నేనూ ఇద్దరమూ నవ్వుతూ బ్రతకవచ్చు. ఇందులో ఏ మాత్రం మిస్టేక్కు వచ్చినా—

కనకయ్య :

నువ్వుండగా అటువంటివేమీ రావడానికి వీలులేదు భుజంగం.

భుజంగరావు :

ఏమో చెప్పలేం. ఎంతటివాడికైన పొరపాటు రావచ్చు.

(బయట మరలా ఎవరో వస్తున్న చప్పుడు. జానకి అలంకరణం పూర్తి చేసుకుని వచ్చి లోపలి గుమ్మంలో నుంచుంటుంది)

కనకయ్య :

వచ్చావా అమ్మా.

భుజంగరావు :

వోహో ! జానకి !! నువ్వేనా ? (కళ్లు తుడుచుకుంటూ) మా చెల్లెలే వుంటే —— ఇప్పుడు. ఇట్రామ్మా. (జానకి గుమ్మం దాటి హాల్లోకి వస్తుంది) నే చెప్పినవన్నీ జ్ఞాపకం వున్నాయి కదూ. ఒక్కమాట ఎక్కువద్దు. ఒక్క డైలాగు తక్కువద్దు. ఎంతవరకు కావాలో అంత వరకూ అలా అలా మాట్లాడేసి చక్కా ఇంట్లోకి వెళ్ళిపో. వూఁ ?

జానకి :

(అలాగేనని తల వూపుతుంది)

కనకయ్య :

అదిగో ఆ తెర వెనక్కాలే మేమూ వుంటాం. నీ పోర్షను అయిపోగానే మామయ్య పిల్లిలా అరుస్తాడు. లోపలకు వచ్చేయాలి.

జానకి :

వూఁ !

(ఇద్దరూ లోపలకు వెళ్ళిపోతారు. భుజంగరావు మళ్ళీ వెనక్కి వచ్చి)

భుజంగరావు :

ఇల్లా ఇక్కడనిల్చుంటే—ఎలాఅమ్మా? (లాంతరువత్తితగ్గిస్తాడు. మనుషుల మొహాలుకూడా గుర్తు పట్టలేనంతతగ్గింపు.) చూడు. ఈ కుర్చీలో కూర్చో. అహా అల్లాకాదు. ఆ గుమ్మం దగ్గర అతనికోసం ఎదురుచూస్తు ఒక పాట పాడుతూ నుంచో ఏం?

జానకి :

నాకేం పాటలు రావే?

భుజంగరావు :

వచ్చిందేపాడు (వెళ్ళిపోతాడు.)

(రంగస్థలంమీద జానకి ఒక్కర్తే వుంటుంది. కుడివైపువరకూ వచ్చి వీధిలోకి చూస్తున్నట్టుగా వుంటుంది.)

కనకయ్య :

(లోపలనుంచి) పాడవేమే? ఒక్క పాటపాడూ.

జానకి :

(మెల్లిగా) అల్లాగే నాన్నా! (పాట పాడుతుంది)

రాబోకు రాబోకురా చందమామ

రాహు పొంచున్నాడురా తోవలోన!

ఆకొంకొక్కరైనాను—అల్లాడ కున్నాది
మబ్బుల్లపై నేదో—మాయ కప్పేసింది!

రాబోకు....

తెల్లన్ని నీకాంతి—నల్లనయ్యేనురా!
చల్లన్ని నీమోము—సన్నగిల్లేనురా!

రాబోకు....

పరమ రాకాసిరా—పాపిష్టి రాహువు
మిత్తిలా నినుబట్టి—మింగబొయ్యేనురా!

రాబోకు....

(పాట అయిపోయేసరికల్లా కనకయ్య లోపల్నుంచి వగరుస్తూ పరుగెత్తుకుని వచ్చి)

కనకయ్య:

ఏం పాటేఇది? శుభంపలకరా మంకెన్నా అంటే....

జానకి:

నాకు మరేం పాటలు రావు.

కనకయ్య:

అయితే నువు పాటలూపాడొద్దు, బండలూపాడొద్దు. ఆ కుర్చీలో కూచో—వాడొచ్చేసరికి (ఎవరో వస్తున్న చప్పుడు) రాహు పొంచున్నాట్ట....రాహు??(లోపలకు వెళ్ళిపోతాడు.)

(జానకి వెళ్ళి కుర్చీలో కూచుంటుంది. ఆమె పెదవులపై సన్ననినవ్వు. ఆత్రంగా వీధిగుమ్మంవైపు ఎదురు చూస్తుంటుంది.

వీధిలోనుండి సుబ్బారాయుడు ప్రవేశం. సుబ్బారాయుడు, రఘుపతీ ఇద్దరూ సమవయస్కులు కావడం మూలాన, దాదాపు అంటే ఒడ్డూ పొడుగూ వున్న వాడవడంచేత, చీకట్లో ఒకరినుంచి మరొకరు అని భ్రాంతి పడడానికి బాగా ఆస్కారముంది.)

సుబ్బారాయుడు :

(సీరియస్‌గా గొంతుమార్చి) జానకీ! జానకీ!

జానకి :

(కంగారుగా) ఒహ్‌! వచ్చారా ?

(జానకి కంగారుతో ఎదమ గుమ్మం పరకూ వెళ్ళి అటువేపు తిరిగివుంటుంది. సుబ్బారాయుడు కుడివేపు గుమ్మం దగ్గర క్రీనీడలో వుంటాడు.)

సుబ్బారాయుడు :

నీ ఉత్తరం చూసిం తర్వాత కూడా రాకుండా వుంటానా ?

జానకి :

(మెల్లిగా) చాలా సంతోషం.

(తర్వాత ఏం మాట్లాడాలి అన్నట్లు కొంచెం మౌనం, సుబ్బారాయుడు కొంచెం ముందుకు వచ్చి)

సుబ్బారాయుడు :

మీ మావయ్యా, నాన్నా వూరికి వెళ్ళారన్నావ్ ?

జానకి :

(పెద్దగా) అవును పొద్దున వెళ్ళారు. (మెల్లిగా) ఇంట్లో వున్నారు.

సుబ్బారాయుడు :

(పెద్దగా) జానకీ! నువ్వు రమ్మనగానే వచ్చేశాను. ఇప్పటికైనా తెల్సుకోలేవూ ఎవరో నేనూ? (మెల్లిగా) ఎందుకు రాశావు. జానకీ, ఆ చీటీ?

జానకి :

(భయంతో) ఎవరూ ? !

సుబ్బారాయుడు :

(మెల్లిగా) సుబ్బారాయుడ్ని. (పెద్దగా) నేనే !!

జానకి :

(నిరాశతో) నువ్వా ?

సుబ్బారాయుడు :

(మెల్లిగా) ఎంత పొరపాటుపనిచేశావ్? (పెద్దగా) ఏం నమ్మలేవా ?

జానకి :

(మెల్లిగా) బావా !! (పెద్దగా) ఆ కుర్చీలో కూచోండి.

సుబ్బారాయుడు :

(పెద్దగా) ఏమిటో విశేషం చెబుతానన్నావ్. (మెల్లిగా) చాలా పొరపాటుపని చేశావ్ జానకీ.

జానకి :

(ఆశ్చర్యంతో) పొరపాటూ?! (పెద్దగా) అవును. మిమ్మల్ని ఇక్కడికి రప్పించగలగడం వో పెద్ద విశేషం కాదూ?

సుబ్బారాయుడు :

(మెల్లిగా) అవును శుద్ధ పొరపాటు. రఘుపతి ఇక్కడికి వచ్చినట్లయితే నీమూలాన చచ్చివుండేవాడు. (పెద్దగా) అదేమంత||విశేషమూ? నువు పిలవక పోయినా నేనే వచ్చేవాణ్ని.

జానకి :

(మెల్లిగా) నిజంగానా బావా? వీళ్ళిద్దరూ కలిసి నా గొంతు నొక్కేశారు. నన్నో తోలుబొమ్మను చేశారు. ఆడిస్తున్నారు. (పెద్దగా) చాలా రోజులైంది మిమ్మల్ని చూసి.

సుబ్బారాయుడు :

(మెల్లిగా) అవును వ్యక్తిత్వం లేకపోయిం తర్వాత నిన్నేమైనా చేస్తారు. మైనపు ముద్దలా ఏ ఆకారం కావాలంటే ఆ ఆకారం వస్తుంది. (పెద్దగా) అవును కొన్ని యుగాలు గడిచినట్లుంది.

జానకి :

(మెల్లిగా) ఇప్పుడేం చేయమంటావ్? (పెద్దగా) యుగాలు గడవటంతోపాటు మనసుకూడా మారిందేమోనని అనుమానంగా వుంది.

సుబ్బారాయుడు :

(పెద్దగా) అది ఆడవాళ్ళ విషయంలో (మెల్లిగా) ధైర్యముంటే ఈ పద్మవ్యూహంలోంచి బయటపడి శివయ్య దగ్గరకు వెళ్లు. రఘుపతిని పెళ్ళిచేసుకునే వరకూ ఏళ్ళెవ్వరికీ కనుపించకు.

జానకి :

(మెల్లిగా) నాకేమిటో భయంగా వుంది. అందరూ అనుకున్నట్టుగా నువు పిచ్చివాడివి కాదు. (పెద్దగా) మీ మగవాళ్ళెప్పుడూ ఇంతే. ఏం సాహసం చేసినా మేమే చేయాలి.

సుబ్బారాయుడు :

(మెల్లిగా) అది నీ కనవసరం. ధైర్యముంటే శివయ్య దగ్గరకు వెళ్ళు. రఘుపతిని పెళ్ళిచేసుకొని ఏవూరన్నా వెళ్ళిపొండి. ఆలస్యం చేశావో నీకూ నాకూ, ముడెట్టేస్తారు. (పెద్దగా) మాటల్లో కాదు సాహసం చేతల్లో వుండాలి.

జానకి :

ఎక్కడున్నారు వాళ్ళు ? (పెద్దగా) ఏం సాహసం . చేయమంటావ్ ?

సుబ్బారాయుడు :

శివాలయం దగ్గర వున్నారు. నువ్వీ సాహసం

చేయగలిగావో ఈ వూరే బాగుపడుతుంది. కలతలు చనిపోతాయి. అభిమానాలు,ఆప్యాయతలూ అందర్నీ పొదువుకుంటాయి. వెళ్లు ఎంత తొందరగా శివయ్య దగ్గరకు వెళితే నీకు అంత మంచిది. (పెద్దగా) నాతో వచ్చేయగలవా ?

(ఒక్కసారిగా లోపల్నుంచి భుజంగరావు కనకయ్య ఆకలిగొన్న పులుల్లా హాల్లోకి వస్తారు. వాళ్ల చూసి చూడగానే జానకి లోపలకు పరుగెత్తుకుని వెళ్ళిపోతుంది.)

భుజంగరావు :

ఏమిట్రూ అన్నావ్ ?—దగుల్బాజీ వెధవా అని.

కనకయ్య :

ఏదీ అను. మళ్ళ ఆ మాట అను. డొక్క చీరేస్తాను.

సుబ్బారాయుడు :

అమ్మ బాబోయ్ ! పులి, పులి, నానోయ్ (వెళ్ళి భుజంగరావును కౌవలించుకుంటాడు.)

భుజంగరావు :

ఎవరూ? (వెళ్ళి లాంతరు పెద్దది చేసి)ఏమిట్రూ నాయనా ఇది. నువ్వెందుకున్నావూ ఇక్కడ ?

కనకయ్య :

ఓరి పిచ్చి వెధవా ! ప్లాన్ అంతా నాశనం చేశావ్ ?

సుబ్బారాయుడు :

రఘుపతి అన్నయ్య నన్ను పంపించాడు. వెళ్ళితే

తను పట్నంనుంచి వచ్చేటపుడు, నాన్నా నీకో పులిబుర్రా, మావయ్యకు తూతూ తూతూ అని వూదుకోడానికి ఓ బూరా, నాకేమో ఓ గుర్రమూ తెచ్చిపెడతానన్నాడు మావయ్యా ! — నువూ రావూ నాతో బాటు.

కనకయ్య :

ఎక్కడికిరా ?

సుబ్బారాయుడు :

గుర్రం మీద వూరేగడానికి.

భుజంగరావు :

వెళ్ళరా నాయనా వెళ్లు. ఇంట్లో స్టీలుగిన్నెలో జిలేబివుంది, జానకి నడిగి పెట్టించుకుని తినిపో.

సుబ్బారాయుడు :

నేనా జానకి నడగను. దానికీ నాకూ జిల్లాయి.

భుజంగరావు :

అయితే నువ్వే తీసుకో పో.

సుబ్బారాయుడు :

నేను వెళ్ళను.

కనకయ్య :

వెళ్తావా ? వెళ్ళవురా.

సుబ్బారాయుడు :

నీతో నాకెందుకు బాబూ (**లోపలికి వెళ్ళినట్టుగా వెళ్ళి తలుపుచాటున దాక్కుంటాడు.**)

కనకయ్య :

నా కేమిటో అంతా అనుమానంగా వుంది భుజంగయ్యా.

భుజంగరావు :

(**ఆలోచిస్తూ**) ఏ విషయంమీద ?

కనకయ్య :

నీ కొడుకు విషయంలోనే.

భుజంగరావు :

ఏమిటీ ?

కనకయ్య :

అవునయ్యా, నీకొడుకు పిచ్చివాడిలా నటిస్తున్నాడని నాకు అనుమానంగా వుంది.

భుజంగరావు :

ఛా ! ఛా! నువ్వా అనుమానం ఏమీ పెట్టుకోనక్కర్లేదు. వాడుత్త భోళాశంకరుడు. నల్లనివన్నీ నీళ్లూ, తెల్లనివన్నీ పాలు అనుకునే ఘటం.

కనకయ్య :

అని నువ్వనుకుంటున్నావ్ ?

భుజంగరావు :

కాదు. ఋజువు పరుస్తాను. మనలో మనకు అనుమానాలుండకూడదు.

కనకయ్య :

ఏ విధంగా ?

భుజంగరావు :

(ఆలోచిస్తూ) ఒక చిన్న ప్లాను. ఈ ప్లాను ప్రకారం వాడు అక్కడికి వచ్చాడా, వాడికి పిచ్చి లేదన్న మాట. కాదూ ?....

కనకయ్య :

ఏమిటా ప్లాను ?

భుజంగరావు :

(పెద్దగా) రఘుపతి పట్నం ఎందుకు వెళ్ళివుంటాడు? కొంప ముంచటానికి కాక. అతనిప్పుడు అర్జంటుగా వెళ్ళి పట్నంలో సరిచూడ వలసిన వ్యవహారం ఏముంది ?—మన ట్రస్టీషిప్ వ్యవహారంకాక. ఇదే సమయం మనకు. పట్నం వెళ్ళినమనిషి పట్నంలోనే అంతర్ధానం కావాలి. తిరిగి రాకూడదు. ఈ విషయం మూడో కంటికి తెలీకూడదు.

రఘుపతి అంతర్ధానం అవుతాడు. అతను కనబడక పోవడంతో శివయ్యకు సంబంధం వుంటుంది.

*కనకయ్య :*

చాలా బావుంది. ఇప్పుడే వెళ్లు. మహేంద్రం కోసం కబురు పంపిస్తాను.

*మహేంద్రం :*

(వస్తూ) అక్కర్లేదు బాబూ. మీరు తల్సుకున్న చోటే మయేంద్రం వుంటాడు.

*భుజంగరావు :*

మహేంద్రం! నిన్న సాయంకాలం నువు చేయలేని పని, ఇవ్వాళ సాయంకాలం నెరవేరాలి. మళ్ళీ ఆంబోతు రంకె వెయ్యకూడదు.

*మహేంద్రం :*

మీ కెందుకు బాబూ. మీరు వల్లకుండండి. ఆడి రక్తంతోనే సూర్యుడు నిద్దర్లేత్తాడు. (వెళ్ళిపోబోతాడు)

*కనకయ్య :*

ఎక్కడో జ్ఞాపకం వుందికదూ? — శివాలయం.... ధ్వజస్తంభం ప్రక్కన ....

*మహేంద్రం :*

నాకు సెప్పుతారా బాబూ?

*భుజంగరావు :*

మాట....వాడి శవం కూడా ఇక్కడెక్కడా వుండకూడదు. రాత్రికి రాత్రి మళ్ళీ పట్నం వెళ్ళిపోవాలి.

మహేంద్రం :

ఆ యేర్పాట్లు మీావే బాబూ ! (వెళ్ళి పోతాడు.)

సుబ్బారాయుడు :

(లోపలిణ్నుంచి పరుగెత్తుకొని వస్తూ) నాన్నా ! నాన్నా ! జిలేబి కాస్తా పిల్లి తినేసింది.

భుజంగరావు :

అయ్యయ్యో ! అందులో ఇంకా అర్ధశేరు జిలేబీ వుంచాను. అర్ధశేరూ దాని పొట్టన పెట్టుకుం దీ?

సుబ్బారాయుడు :

నేను పెట్టలేదు నాన్నా ! అదే పెట్టుకుంది.

భుజంగరావు :

ఇంకేం చేస్తావ్ అఘోరించు.

సుబ్బారాయుడు :

(గారాబంగా) నాన్నా ! నాకు జిలేబీ కావాలి.

కనకయ్య :

ఇప్పుడెక్కణ్నుంచి తెచ్చిపెట్తాడ్రా ?

భుజంగరావు :

ఈ వూళ్ళో కోమటి గురవయ్య కొట్లోకూడా బెల్లం లడ్డులే తప్ప మరేవీ దొరకవుగదురా?

సుబ్బారాయుడు :

నాకు అవ్వొద్దు.

భుజంగరావు :

మా నాయనకదూ, ....పోనీ అరసోలెడు సెనగపప్పు కొనుక్కునీ, అందులో కాస్త బెల్లం కలుపుకుతిను.

సుబ్బారాయుడు :

నాకేం అక్కర్లా. .... మావయ్యకు పెట్టు.

భుజంగరావు :

మరింకెక్కడ చచ్చేదిరా నేను? .... ఏం చెయ్య మంటావురా!

సుబ్బారాయుడు :

నువ్వేం చేస్తావో నాకేం తెలుసు?

కనకయ్య :

ఒరేయ్, సుబ్బులూ!— ఈ రూపాయి తీసుకపోయి ఆడుకో పో.

సుబ్బారాయుడు :

(సంబరపడుతూ) నా కొకరూపాయి కాదు. అయిదు రూపాయలు కావాలి.

కనకయ్య :

ఏం చేసుకుంటావురా?

సుబ్బారాయుడు :
పెళ్ళిచేసుకుంటా.

కనకయ్య :
(ఇచ్చేస్తూ) ఎవర్నిరా?

సుబ్బారాయుడు :
అది నీకెందుకూ ? (బయటకు వెళ్ళిపోతాడు)

భుజంగరావు :
జాగ్రత్తరా నాయనా. చీకటి పడుతోంది. జాగ్రత్త. డబ్బు చూస్తే చాలు అందరూ మోసం చేస్తుంటారు.

కనకయ్య :
(నవ్వుతూ) అక్కడికి మనం చెయ్యనట్టు ?

భుజంగరావు :
దీన్ని మోసం అనరోయ్. రక్తదాహం అంటారు.

కనకయ్య :
అట్లాగా ! (ఇద్దరూ తెరలు తెరలుగా నవ్వుకొంటారు)

భుజంగరావు :
సరే. సరే. పద. పద. అక్కడ వ్యవహారం తల్లక్రిందులు కాకుండా చూసుకోవాలి. అదనుకు మనం లేకపోతే అంతా పీకలమీదకు తెచ్చినా తెస్తాడు వాడు.

కనకయ్య :

భుజంగం, ఒక సందేహం. మొదట్లో — తొందరపడి ఏ పరిస్థితుల్లోనూ రంగస్థలంమీద నుంచి ఒక పాత్రను ఖాళీ చేయించకూడదన్నావ్ కదా — మరి ఇప్పుడు నువ్వే ఆ పద్ధతిని ప్రోత్సహిస్తున్నావేమిటి?

భుజంగరావు :

నిజం. ఆ ముక్క నేనన్నమాట నిజమే. తొందరపడి ఏ పావునూ చదరంగంమీద నుండి తీసివేయకూడదు. తెలుసుకదూ నీకు. సామ, దాన, భేద, దండోపాయాలని. శివయ్యను సామంతో, రఘుపతిని భేదంతో, కోటప్పను దానంతో, సాధిద్దామనుకున్నాను. కానీ, మొదటి రెండూ విఫలమయేసరికి మూడోదానిమీదకు కూడా మనను పోలేదు. ఇహ దండం ఒక్కటే మిగిలివుంది మరి.

కనకయ్య :

దీంతో అయినా మనం ఆడుతున్న నాటకం అయిపోయి, అంతా ఓ ప్రశాంతతకు వస్తామా అని.

భుజంగరావు :

చెప్పలేము. ఇప్పుడెందుకూ ఆ ప్రస్తావన. పద.పద.
(ఇద్దరూ వెళ్ళిపోతారు.)

(రంగస్థలం కొంతసేపు నిర్జనంగా వుంటుంది. మళ్ళీ వీధిలో నుండి సుబ్బారాయుడు ప్రవేశిస్తూ)

సుబ్బారాయుడు :

జానకీ! ఓ జానకీ—

జానకి :

(లోపలినుంచి గుమ్మం వరకూ వచ్చి) ఎందుకూ ?

సుబ్బారాయుడు :

ఇంకా ఇక్కడే వున్నావా ? ఏమిటి జానకి యిది ?

జానకి :

ఇదంతా చూస్తుంటే నాకేదో భయంగా వుంది.

సుబ్బారాయుడు :

నన్నుచూచి భయమెందుకు జానకీ? తల్లి చచ్చి, మేనమామను బ్రతకమన్నారు. ఆ మాత్రం స్థానమియ్యి, చాలు నాకు.

జానకి :

అబ్బెబ్బే! నిన్ను చూచి కాదు.

సుబ్బారాయుడు :

మరెందుకూ అయితే ఆలస్యం? తోడేళ్ళు రెండూ బయటికి జారుకున్నాయి. ఏదో ప్రమాదం వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి. త్వరగా నువ్వూరా.

జానకి :

ఎక్కడికి ?

(ప్రథమాంకంలో కన్పించినట్లే అంతా వుంటుంది. ఏమీ మార్పులేదు. అదే శివాలయం, అదే వాతావరణం. ఇప్పుడు శివాలయం మరింత చీకటి అలుముకుని వుంది. పాత్రలు మరింత మసకగా కన్పిస్తుంటారు. కానీ పోనుపోను చంద్రోదయంతో పాలవెన్నెల ఆ వాతావరణాన్ని ఆలుముకొంటుంది.

ఒక్కమాట. ఈ అంకంలో చాలాభాగం ఛాయానాటకంగా వేస్తే ఫలితం మరింత స్ఫుటమవుతుంది. మాటలు వినిపిస్తూ, ఆ ఆయతనం పగిలిన గోడమీద, తునకలు తునకలుగా ఓ పావుగంట సేపు పాత్రలు కన్పించకుండా ఆ పాత్రల నీడలు కన్పించాలి.

(తెర తొలిగేసరికి మహేంద్రమొక్కడే రంగస్థలంమీద వుంటాడు. ఎవరి కోసమో అటూయిటూ వెదకుతూ తిరుగు తుంటాడు. ఆకలిగొన్న చూపులు. రూపుగొన్న క్రౌర్యం.)

వెనకనుంచి సాకీ విన్పిస్తుంటుంది.

సాకీ :

'భయం! భయం! బ్రతుకు భయం! అన్నా!
మనకీ లోకం పన్నిన పద్మవ్యూహం'
భయం! భయం! బ్రతుకు భయం! అన్నా!
మాయ లేడి లాంటి బ్రతుకు
విషవాంఛలు రేపెనో,

జీవన కాసారమ్మున
సుడిగుండం లేచెనో ....
భయం ! భయం ! బ్రతుకు భయం ! అన్నా !

మహేంద్రం :

(అటూయిటూ తిరుగుతూ) ఇంకా రానేదు పిరికెదవలు ! అసలొత్తారో నేదో ? (కూచుని బీడీ వెలిగించుకుంటాడు. ఒక్క దమ్ములాగి) అరెరె ! ఈడ మడిసున్నట్టు ఆళ్ళకు తెలిత్తే ఎల్లా, కొంప మునుగుద్ది. (బీడీ ఆర్పేస్తాడు. అటూ యిటూ తిరుగుతూ,) ఇదే కదాంట, ఆళ్ళు పట్టం న్నుంచొచ్చే దారి ! నా సామిరంగ — ఆళ్ళొచ్చే వరకూ ఏంసెయ్యాలాఅని. (శివలింగంవేపు చూసి, నవ్వి) ఈ దేవుడేమో మాట్టాడ్డు ! మాట్టాడక పోతేయేం ? ఏవయ్యా — శివయ్యీటకదూ నీపేరు ? — ఏం సేత్తుంటావ్ నువ్వు ? — మంచోళ్ళను బెతికిత్తూ సేడ్డోళ్ళను సంపుతుంటావా ? — అసలు మంచీ సెడూ ఏందయ్యా ? — నీకు నువ్వు మంచోడివి. నాకు నేను మంచోడ్ని. (దూరంనుంచి మాటలు విన బడతాయి)

నారాయణ :

బాబూ, కాసేపు కూచుందాం. నడిచి నడిచి ప్రాణాలు సొమ్మసిల్లుతున్నాయి.

రఘుపతి :

అదిగో, అదే శివాలయం. అక్కడ కాసేపు కూచుని, విశ్రాంతి తీసుకుందురుగాని. వూరి చివర ఈ శివాలయం .... ఆలయానికి ప్రక్కనే వున్న ఈదారి....

మహేంద్రం :

(తడబడుతూ) అరెరె, ఆళ్ళొత్తున్నారు, ఆళ్ళొచ్చేత్తున్నారు!! ఏం సేడం ? ఏం సేడమా అని ? అహ, ముందే సెయ్ సేసుకోడం మంచిదికాదు. ఆళ్ళు సెప్పుకునే ఆ రగస్యాలేవిటో ఇని మరి కలీబడతాను.

**(పక్కకు తప్పుకుంటాడు)**

**(నారాయణ, రఘుపతి ప్రవేశిస్తారు. ఇద్దరూ బాగా వడిలిపోయినారు. ఇద్దరిలోనూ ఈ జీవనం అతిభారమైన దన్న తలంపు)**

నారాయణ :

(చతికిల బడుతూ) శివయ్యా తండ్రీ—శివయ్యా తండ్రి?!

రఘుపతి :

(కోపంగా) శివయ్యా తండ్రి ? ఆ శివత్వమే ఈ జీవితంలోంచి నశిస్తోంది.

నారాయణ :

అబ్బాయ్, నిరాశ పనికిరాదు.

రఘుపతి :

నిరాశ ! ! అంటున్నానని కాదు. మీకుసమాధానం

చెప్తున్నాననికాదు. నా జీవితమే నిరాశకు ప్రతి రూపం. (గద్గదికంగా) దేవతలాంటి అమ్మ చచ్చిపోయింది, కాదు చంపబడ్డది. నాన్న రాక్షసుడై నాడు. ఆదరిస్తుందనుకొన్న దేశం కాదు పొమ్మంటున్నది. అన్నిచోట్లా విలువలు నాశనమవుతున్నాయి. ఏం చూసుకుని ఈ జీవితంలో సంతోషం పొందను?

నారాయణ :

పిచ్చినాయనా! – పిచ్చినాయనా!! ఆదర్శాలను అండగా తీసుకుని, మోసపోయా ననుకుంటున్నావు నువ్వు. జీవితానికో ఆదర్శం లేకపోవడం మూలాన పతితుడై పోయిన వాణ్ని నేను. కట్టుకొన్నభార్యను చంపుకొన్నాను. కన్న కొడుకును వెళ్ళగొట్టుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని కాలదన్నుకొన్నాను. జీవితంఅంతా గడిచిపోయి, కన్నీళ్ళలో బాధలలో తెల్లవారిం తర్వాత కానీ ఈ మాత్రం.... చివరకు యీ శాంతి నాకు కరువయేలా వుంది.

రఘుపతి :

(విషాదంగా) మీ కథగూడా నా కథలాగానేవుంది.

నారాయణ :

(మెల్లగా లేచినుంచుంటూ) సరే. ఈ కథలూ, బాధలూ ఎప్పుడూ ఉండేవేలే. పద నాయనా. ఎదురుచూసి,

ఎదురుచూసి శివయ్యగారే ఇహ బయల్దేరతారు మనకోసం.

రఘుపతి :

మీరు వెళ్ళిరండి. నే రాను.

నారాయణ :

అదేమిటి ?

రఘుపతి :

ఏ మొహంతో వారిని చూడగలను ? దేవుడిలాంటి ఆయన మాటను కాదని పౌరుషంకోసం వెళ్ళాను. తీరా వెళ్తే —

నారాయణ :

నాకు తెలుసు నాయనా! — డబ్బు లేనివాడిలో ఎన్ని మహాత్వ గుణాలున్నా పనికిరాని కాలమిది.

రఘుపతి :

(ఆవేశంగా) కాలం? డబ్బు? (తమాయించుకుంటూ) ఏమిటో! పిచ్చివాణ్ణయిపోతున్నాను. కనకయ్యను తల్చుకొంటున్న కొద్దీ కంపరమెత్తుతోంది.

నారాయణ :

వద్దు నాయనా! ఆవేశం వినాశానికి దారితీస్తుంది. అలా ఆలోచించకు.

రఘుపతి :

ఏంచేయను? ఇదీ అని చెబితే 'ఏదీ సంచీ' అన్నాడు. సంచీ ఏమిటన్నాను. 'తియ్యేవోయ్, హాస్యాలాడక. ఎంత వుందేమిటో సంచిలో?' అన్నాడు. హాస్యాలుట! నన్ను తెలిసిన మిత్రుడు. అతన్ని నమ్ముకుని వెళ్లాను. బోర్లాపడ్డాను. ఎంతో బ్రతిమలాడాను. 'క్షమించాలి బ్రదర్. భుజంగయ్య రెండువేలిచ్చాడు. నువు నాలుగువేలిస్తే నీకే ఆ పని సానుకూలపడుతుంది. చాలీచాలని యీ జీతాల్తో నేనూ, నా పెళ్ళామూ, ఆరుగురు బిడ్డలూ బ్రతకాలి' అన్నాడు. అంటూ ఏవేవిటో నీతులు చెప్పాడు. ఆ ధర్మాలూ నీతులూ తల్చుకుంటున్నకొద్దీ నా తల తిరిగిపోతున్నది. అబ్బా!

నారాయణ :

ఆవేశపడకు.

రఘుపతి :

ఆ ఆవేశమూ లేకపోతే బ్రతుకు మరింత దుర్భరమే అవుతుంది. అవును. బ్రతుకు!! ఎందుకిలా బ్రతకాలి? ఏం పాపం చేశానని ఒక్క నాలుగువేల రూపాయలు!!! ఆ నాలుగు వేలతో కనకయ్య అదృష్టం తిరిగిపోతుంది. నా పరపతి పెరుగుతుంది.

అంటే డబ్బులో తప్ప ధర్మమూ, న్యాయమూ, లేవన్న మాట! ఈ కనకయ్యకు డబ్బుంది కాబట్టి కులుకుతున్నాడు. (రాక్షసంగా) ఆ ఇనపపెట్టి బ్రద్దలు కొట్టి అతని కూతుర్ని ఎత్తుకుపోయి....

నారాయణ:

(బాధగా) రఘూ!

మహేంద్రం:

(విసురుగా ప్రవేశిస్తూ)
ఏందిరా కూసినావు? మల్లా అను.

రఘుపతి:

అంటాను. ఎన్నిసార్లయినా అంటాను. ఈ జీవితం లాంటి జీవితాలు కుళ్ళిపోయేవరకు, ఈధర్మంలాంటి అధర్మాలు దేశంలో పీడ కలయేవరకు, ఆర్ష ధర్మం ప్రతిష్ఠింప బడేవరకు ఇలాగే అంటాను. ఎన్నిసార్లయినా అంటాను. ఈ ద్వేషాలు, ఈ కుట్రలు, ఈ రక్తదాహం, ధనదాహం....

మహేంద్రం:

మా అయ్యగార్నేంట్రా అన్నావ్?

రఘుపతి:

అయ్యగారు? కుళ్ళిపోయిన చెట్టులాంటివాడు. చెరిగిపోవలసిన అధర్మానికి రాక్షసిలాంటి ప్రతినిధి.

మహేంద్రం :

ఏంట్రా ? మా అయ్యగారు రాచ్చసుడా ! నువ్వురా-నువ్వ ? కాల్లో ముల్లులాంటోడివి. సెవిలో జోరీగవు. కంటిలో నలుసువి. సెప్పులో రాయివి.

(అంటూ కత్రవత్తి కొడతాడు. నారాయణ ఆఁ!ఆఁ! అంటూ అడ్డుబోతాడు. ఆ దెబ్బ సరిగ్గా నారాయణ నెత్తిమీద తగులుతుంది. కపాలం పగిలిపోతుంది. రక్తం ధారలై ప్రవహిస్తుంది. ఆ దృశ్యాన్ని చూసి రఘు చలితుడై పోయాడు. నారాయణ స్పృహతప్పి క్రింద పడిపోతాడు. రఘుపతిలో కోపానికి పరాకాష్ట, కళ్ల చింతనిప్పులు.)

రఘుపతి :

చంపటం కాదు, చావటం కూడా నేర్చుకోరా.
(దగ్గర్లోనే పెద్దరాయి వుంటే అది తీసుకుని మహేంద్రం మీద వేయబోతాడు. శివయ్య అకస్మాత్తుగా ప్రవేశించి)

శివయ్య :

ఆగు.

రఘుపతి

(ఆగిపోతాడు)

శివయ్య :

మూర్ఖుడా ! (వణికిపోతూ) చదువుకోడం కాదు సమయానికి ఉపయోగించుకోవాలి.

రఘుపతి

బాబాయ్! (కుప్పలా అతని కాళ్ళమీద పడిపోతూ) క్షమించు బాబాయ్ ఆవేశంలో పశువునయ్యాను. (ఏడుస్తూ) తండ్రిలాంటి నారాయణ....

శివయ్య :

తండ్రిలాంటికాదు. అతను నీ తండ్రి.

రఘుపతి :

ఆ! ఒక్కసారిగా తండ్రిమీద పడిపోతూ నా..న్నా!!

నారాయణ :

(మెల్లిగా కళ్ళువిప్పుతూ తనమీద పడ్డ రఘుపతిని కళ్ళ మీదకు తీసుకుంటు అరచేతి మీదనున్న పుట్టుమచ్చను చూసి ఒక్కసారిగా) ఆఁ! ఆఁ! ....ఈ మచ్చ. ఈ పుట్టుమచ్చ.... ఈ....పు....పు....పుట్టు.... మ....మచ్చ....

రఘుపతి :

(ఏడుస్తూ) నాన్నా! నాన్నా! కళ్ళుండీ గుడ్డివాణ్ణయ్యాను. నిన్ను....నా నాన్నను, నా నాన్నను నేను గుర్తించలేక పోయాను. నాన్నా....నాన్నా....

నారాయణ :

రఘూ! ర....ఘూ!

రఘుపతి :

నాన్నా! నన్ను క్షమించు నాన్నా!!! నిన్ను

ఒంటరివాణ్ని చేసి ఏదో ధర్మం బావుకుందామని వంటరిగా ఈ లోకంలోకి వచ్చాను. తలను బొప్పి కట్టించుకున్నాను. నాన్నా.... నాన్నా....

నారాయణ :

అబ్బా! మాట్టాడలేను. ఎన్నో సంగతులు వినా లనిపిస్తోంది. అబ్బా! మైకముగా వుంది. రఘూ! నా రఘూ! అనవూ, నన్ను క్షమించాననవూ ?

రఘుపతి :

కాదు నాన్నా. అలా అనకు. నువు నన్ను క్షమించాలి. నువ్వే నన్ను క్ష..మిం..చాలి.

నారాయణ :

**(తల అడ్డంగా తిప్పుతూ)** కాదురా నువ్వే నన్ను క్షమించాలి. అనరా. అబ్బా! అనవేరా!! మైకం.... మైకం.. నొప్పి.... బాధగా వుంది. అనరా, క్షమించాననరా.

శివయ్య :

అను రఘుపతీ.

రఘుపతి :

క్ష....మిం....చా....ను..

నారాయణ :

**(ఆనందంతో)** లక్ష్మీ! ఇప్పటికి క్షమించావా నువు

నన్ను !! — ఇంత కాలానికి (మూగన్నుగా) రఘూ !
శివయ్యా చెప్పినట్టు విను. మంచిగా బ్రతకడమే ఇవ్వాళ ఒక తపస్సు. (మైకంలో పడిపోతాడు.)

రఘుపతి :

నాన్నా !.... నాన్నా .... !

శివయ్యా :

(నాడిచూసి) భయం లేదు రఘూ. నాడి అందుతూన్నది. తొందరగా వెళ్ళు. ఆచారిగార్ని పిల్చుకురా.

మహేంద్రం :

(వికటంగా) ఆచారిగారు వూర్లో లేరు.

రఘుపతి :

(పెద్దగా) మహేంద్రం (చప్పగాచల్లారిపోయి) బాబాయ్! ఎంతటి కఠోర పరీక్ష పెట్టావ్ నాకు !

కోటప్ప :

(వస్తూ) ఏమిటి ? ఏం జరిగింది? (ఎవరూ మాట్లాడరు) ఎవరూ మాట్లాడ్రేమిటి ? అయ్యో ! అయ్యయ్యో ! ఇదేమిటి ? (పరిస్థితిని అర్థం చేసుకుంటూ) ఒరేయ్ నువ్వేనా కారణం.

మహేంద్రం :

(పగలబడి నవ్వుతాడు)

కోటప్ప :

నవ్వడమే కాదు, సావటుంకూడా తెల్సుకోరా.

(కర్రెత్తుతాడు)

శివయ్య :

కోటప్పా !....నువ్వూ పశువ్వవుతావా ?

కోటప్ప :

ఏందిబాబూ – కాటేసిన పామును సంపద్దంటారు?

శివయ్య :

అవతల పారేయ్ ఆ కర్రను.

కోటప్ప :

(విసుగ్గా అవతల పారేస్తాడు)

శివయ్య :

పోయి ఆచార్లుగార్ని పిల్చుకురా.

(కోటప్ప మవునంగా బయల్దేరుతాడు. కుడివైపుదాకా వస్తాడు. ఇంతలో భుజంగరావు, కనకయ్య ప్రవేశం. భుజంగరావు నిమిషంలో అంతా ఆకళించుకొంటాడు)

భుజంగరావు :

భయపడకు మహేంద్రం, మేమున్నాం.

మహేంద్రం :

నాకు బయమేటి బాబూ ? – ముసిలోడ్ని సంపానే అని సిగ్గుగా వుంది.

భుజంగరావు :

రఘుపతీ—శివయ్యగారూ ! వినండి. ఈ వూరునుండి మీరు తక్షణం వెళ్ళిపోవాలి.

శివయ్య :

ఇంతేనా ? ఈమాత్రందానికి ఒక నిండుప్రాణాన్ని పరిహారంగా తీసుకున్నావు.

రఘుపతి :

నాన్నా ! (తండ్రిమీదపడి దేహం చల్లగా తగలడంతో) నాన్నా ! (పెద్దగా ఏడుస్తాడు) నిన్నుకాదని నేను ఎంతదూరం పోయినా చివరకు నాకోసం నువు నీ ప్రాణాన్నే త్యాగం చేశావా ? నాన్నా ! !

శివయ్య :

భుజంగయ్యా ! చూడు. ఆ తండ్రీకొడుకుల అను బంధం చూడు. ఇరవైయ్యేళ్ళ తర్వాత కలుసు కున్నారు. తండ్రిఅనీ, కొడుకుఅనీ తెలీకుండానే అభిమానం చూపించుకున్నారు. ఆ బ్రతుకును, ఆ అభిమానాలను, ఆ ఆనందాన్ని నువు త్రుంచేశావు. (భుజంగరావులో ఏదో చెప్పలేని కదలిక) నీకూ కొడుకు న్నాడు. నీకొడుకుమీది అభిమానం నీకూవుంది నారాయణ ఈమాత్రం నోచుకోలేదా ?

(భుజంగరావు పూర్తిగా కదిలిపోయాడు.)

*భుజంగరావు:*

శివయ్యబాబూ! ఇదంతా పొరపాటున జరిగింది.

*శివయ్య:*

పొరపాటు. నారాయణను కాకపోతే రఘుపతిని చంపేవాళ్లు. ఏమిటీ చంపుకోటాలు? ఎందుకోసమని?

*కనకయ్య:*

రఘుపతి మేము చేసే పనికి అడ్డొస్తున్నాడు.

*శివయ్య:*

పనులు!! ఏం పనులయ్యా? అధికారం, ధనదాహం, అరిషడ్వర్గాల చేత ప్రలోభింపబడడం — ఇదేనా జీవితం?

*కనకయ్య:*

మీ మీద మాకు గురుభావమున్నది. కానీ రఘుపతి యువకుడు.

*శివయ్య:*

అంటే?

*భుజంగరావు:*

మీరు మరెక్కడికైనా వెళ్లిపొండి. మా ఎదుట మాత్రం వుండకండి.

శివయ్య :

అంతేనా? (గద్గదికంగా) లే రఘూ! బ్రతికిన ప్రతీ వాడూ చనిపోవలసిందే. ఆత్మ ఈ దేహాన్ని విడిచి మరొక దేహాన్ని ఆశ్రయించినట్లుగా, బ్రతకదల్చిన ప్రతివాడూ, వూళ్ళుమారవలసిందే. కోటప్పా! నారాయణను భుజంమీద వేసుకో. అదృష్టవంతుడు! శివుని సన్నిధిన ప్రాణం విడిచాడు. పశ్చాత్తాపంతో తన పాపాన్ని హరించుకున్నాడు పద.

**(ముగ్గురూ బయల్దేరుతారు)**

**(ఇంతలోకి సుబ్బారాయుడు పోలీసులని తీసుకు ప్రవేశిస్తాడు)**

సుబ్బారాయుడు :

(పరిస్థితి చూచి) అయ్యో! అయ్యయ్యో అనుకున్నంతా అయింది.

సబిన్ స్పెక్టరు :

ఆ శవాన్ని క్రిందకు దింపండి.

**(కోటప్ప ఆ శవాన్ని ఓ చెట్టుచాటున పరుండబెట్టి వస్తాడు.)**

సబిన్ స్పెక్టరు :

ఈ పని ఎవరుచేశారు?

మహేంద్రం :

(గర్వంగా) నేనే సేశాను.

సబిన్ స్పెక్టరు :

అయితే నిన్నరెస్టు చేస్తున్నాను.

మహేంద్రం :

అరెట్టు? అరెట్టు దేనికీ?

సబిన్ స్పెక్టరు :

చంపినందుకు.

మహేంద్రం :

సంపడం!!! (నవ్వుతూ) అరెట్టు!!! బేసో — ఇదేంది కనకయ్ దొర్రా?

కనకయ్యా :

భయపడకు మహేంద్రం — నేనున్నాను. (దగ్గరకు వెళ్ళి మెల్లగా) నువ్వేం భయపడకు.

సబిన్ స్పెక్టరు :

వూహూ! పదపద. స్టేషన్‌కి పద. అక్కడ అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చు. మళ్ళీ నక్కల పొలానికి వెళ్ళాలి. ఎక్కడచూచినా హత్యలూ, దొంగతనాలూనూ.

మహేంద్రం :

దొంగతనం? — సీత్ — సీత్తే, నారాజా, దయిర్యముంటే సఫా సెయ్యాలగానీ, దొంగతనమేంటుంట? — బక్కెదవులు.

సబిన్ స్పెక్టరు :
నీ పేరేమిటి ?

మహేంద్రం :
మయేంద్రం.

సబిన్ స్పెక్టర్ :
మహేంద్రం! ఒక్కమాట నువ్వు ఎక్కువ మాట్లాడినా అది నీకు వ్యతిరేక సాక్ష్యమై కోర్టులో నీ గొంతుకు ఉరి బిగుసుకుంటుంది.

మహేంద్రం :
(భయంతో) అట్టాగా.

సబిన్ స్పెక్టరు :
పద.

మహేంద్రం :
దొరా! కనకయ్‌దొరా! (జాలిగా) కనకయ్‌దొరా!
**(సబిన్‌స్పెక్టరు మహేంద్రాన్ని నెట్టుకుంటూ కొంతదూరం తీసుకుని పోతాడు)**

కనకయ్య :
అయ్యా, సబిన్‌స్పెక్టరుగారూ, ఒక్కమాట.

సబిన్ స్పెక్టరు :
ఏవిటది ?

కనకయ్య :
అతనమాయకుడు. చెప్పినపని చేశాడు. అంతే.

సబిన్ స్పెక్టరు :
అయితే చేయించినవారెవరు ?

కనకయ్య :
నేను.

సబిన్ స్పెక్టరు :
మీరా ?

కనకయ్య :
ఏం ? అలా ఆశ్చర్యపోతున్నారు? మాలాంటివారు, ఈపన్లు చెయ్యలేరనా ? అవును. నిజమే. నే నే చేయించాను.

సబిన్ స్పెక్టరు:
అందుకు సాక్ష్యం?

కనకయ్య :
నే నే.

సబిన్ స్పెక్టరు :
(నవ్వి) మీరతన్ని తప్పించడంకోసం ఇలామాట్లాడుతున్నారు. మేం నమ్మం.

కనకయ్య :

నే చెప్పినా నమ్మరా ?

సబిన్‌స్పెక్టర్ :

అధికారానికి కళ్ళున్నాయి కాని చెవులు లేవు.

మహేంద్రం :

బాబూ, కనకయ్ బాబూ! నా గురించి మీరు బురదలో దిక్కండి. గ్నాపకముందా ? — ఒకనాడు నేనే సెప్పాను. మీ గురించి పేణమైనా ఇత్తానని ఆ అదురుట్టం ఇంతకాలం దొరికింది గాదే అని ఇసారపట్టున్నాను. అయినా నేనిచ్చినమాట నెర వేర్చుకుండాను. అది సాలు నాకు.

కనకయ్య :

కాదు. మహేంద్రం! నువు వెళ్ళడానికి వీల్లేదు, వీల్లేదు. నువు చేసిన పనిలో నాకూ భాగంవుంది. ఆ పాపాన్ని, యజమానిగా నేనూ పంచుకున్నాను. హంతకుడిగా ఆ శిక్షను నేనూ పంచుకోవాలి.

సబిన్‌స్పెక్టర్ :

క్షమించండి. ఆధారాల్లేకుండా మీరు మాట్లాడు తున్నారు.

కనకయ్య :

ఆధారాలు? అతన్ని అరెస్టు చేయడానికి మీకేం ఆధారాలున్నాయి?

సబిన్‌స్పెక్టర్ :

(నవ్వి) ఇంకా అంతగుడ్డివాళ్ళం కాలేదు. ఆ కర్రమీద వ్రేలి ముద్రలుంటాయి. ఆ కర్రమీద రక్తం మరక లున్నాయి. సాక్షులుగా మీరందరూ వున్నారు. ఇంతకన్నా ఏం కావాలి?- పద మహేంద్రం!

(మహేంద్రాన్ని తీసుకుని వెళ్ళిపోతాడు)

మహేంద్రం :

(వెనక్కు వచ్చి) దేవుడూ! నువ్వుండమాట నిజమే! మేమే మాయ అద్దాల్లో ప్రతిబింబాలం. ఒప్పు కుంటుండా.

(మోకాళ్ళ మీద ఆని నమస్కారం పెడతాడు)

సబిన్‌స్పెక్టరు :

స్టేషన్లో ఇంకా తీరుబడిగా కూచుని దేవుణ్ణి ప్రార్థించు కోవచ్చు. పద పద.

మహేంద్రం :

దండాలు బాబూ. ఈ దాసుణ్ణి గ్నాపకముంచు కోండి.

(వెళ్ళిపోతాడు. కొంచెం విశ్శబ్దం)